

★

YOUTH UNITE! FORWARD FOR LASTING PEACE
WORLD FEDERATION DEMOCRATIC YOUTH

ఆంధ్ర విద్యార్థి యువజన
మాసపత్రిక

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి

నవయుగ

యువజన మాసపత్రిక

సంపుటి 1 — 1947 నవంబరు — సంచిక 9

★ సంపాదకీయం

మతకలహాలను అరికట్టండి!

బ్రిటిష్ సామ్రాజ్యవాదులు దేశాన్ని వదలుతూ మన ప్రజలలో మతకలహాలు రెచ్చగొట్టారు. తమ పరోక్షపరిపాలనకు తోడ్పడుటకు దేశంలో అరాచకం వ్యాపించుటకు, అభ్యుదయ పంథాన దేశాన్ని నడిపించ కృషి జరుపు నెహ్రూ ప్రభుత్వాన్ని నాశనం జేయుటకు కుట్రలు పన్నారు. ఇందుకు ఉద్యోగాలలోని తెల్ల ఆఫీసర్లను, స్వదేశ సంస్థానాధీశులను, మతతత్వవాదులను ఉపయోగించ దల్చారు. దాని ఫలితమే నేటి దేశంలోని అంతర్యుద్ధజ్వాలలు. మతకలహాలు జరిగినచోటనెల్లా ప్రజాసామాన్యం నష్టబడ్డారు. ఆస్థులు పోగొట్టుకొన్నారు. జీవితాలు గుప్పిట్లలో పెట్టుకొని, తమ సర్వస్వాన్ని వదలుకొని యితరప్రాంతాలకు వలస పోవలసివచ్చింది. ఈ మతకలహాలు వ్యాపించినచోట్లనెల్ల మతతత్వవాదుల, స్వదేశ సంస్థానాధీశులది పైచేయి అయింది. ప్రజాజీవితం స్తంభించిపోయింది

దేశమంతటా చెలరేగిన యీ మత ప్రచారము ఆంధ్రదేశంలోని మతోన్మాదులను ఉత్సాహ పర్చింది. ఇచ్చట ముస్లిము మైనారిటీలపై పంజాబు, బెంగాలులలో హిందూ మైనారిటీలపై జరిగిన అత్యాచారాలకు పగతీర్చుకోవాలని బాహాటంగా ప్రచారం సాగించారు. ప్రతిచోటా యీ మతకలహాల వెనుకనున్న ఆర్. యస్. యస్. ను సమీకరించ ప్రారంభించారు. ఇందుకు జమీందార్లు దొంగ వ్యాపారస్థులు; పెద్దపెద్ద పెట్టుబడిదార్లు అవసరమైన మద్దతిస్తున్నారు. మన రాష్ట్రంలో గూడ మతకలహాలు వ్యాపింపజేసి యితర రాష్ట్రాలలోవలె ఇచ్చటగూడ తమ పెత్తనాన్ని ప్రజాజీవితంపై సుస్థిరం చేసుకో వచ్చునని: తమ దోపిడిని ముస్లిం వ్యతిరేక భావాలు రెచ్చగొట్టి కప్పిపుచ్చుకొన వచ్చునని, యీ దోపిడిగాండ్రు కుతంత్రాలుపన్నుతున్నారు ఇప్పటి కప్పుడే గూడూరులోని మైకా గనుల యజమానులు యీ కార్యక్రమాన్ని అమలు జరుపుటకు పూనుకొన్నారు. నెల్లూరులో విపరీతంగా మతోద్రేకం రెచ్చగొడుతున్నారు, గుంటూరులో యీ మతకలహాల పేరుతో ముస్లిం షాపులు కొన్ని లూటీ చేయబడ్డాయి. కాని ప్రజల మద్దతు యీ మతదురహంకారులు పొందలేక పోవుటచే తాత్కాలికంగా వెనుకడుగు వేశారు. లోన తమ కుట్రలను మాత్రం సాగిస్తున్నారు.

నేడు ఆంధ్రదేశంలో జరిపే యీ మత ప్రచారానికి విద్యాలయాలు ముఖ్య కేంద్రాలుగా ఉపయోగింప బడుతున్నాయి. విద్యార్థులకు సెలవులలో ప్రయివేటు క్లాసులను పెట్టుటకు అంగీకరించి. తర్వాత ఆర్. యస్ యస్. క్యాంపు జరుపుటకు అడ్డు వస్తాయని బెజవాడ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రయివేటు క్లాసులను రద్దుపర్చాడు. నూజివీడు జమీందారు క్రింద నడపబడే నూజివీడు హైస్కూలు, వానపాముల హైస్కూలు, బెజవాడ కాలేజీ యీ ఆర్. యస్. యస్. కు కేంద్రాలు, విద్యార్థి ఉద్యమాన్ని నాశనం చేయుటకు నిరంకుశులయిన బందరు ప్రిన్సిపాల్ బోటి వ్యక్తులు నేడు ఆర్. యస్. యస్‌ను తమ విద్యాలయాల్లో ప్రోత్సహిస్తున్నారు. అనేక మంది పెట్టుబడిదార్లు చాలీ చాలని జీతాలతో బాధపడే ఉపాధ్యాయులకు ప్రత్యేక అలవెన్సులు యిచ్చి, మత ప్రచారానికి, ఆర్. యస్. యస్ ప్రచారానికి ఆ ఉపాధ్యాయులను వినియోగిస్తున్నారు. మద్రాసు ప్రభుత్వం విద్యాలయాలలో మతప్రచారాన్ని నిషేధించుతూ ఆర్డర్లు జారీ జేసినా ఎచ్చటా అవి అమలు పర్చబడుటలేదు. పై పెచ్చు మత కలహాలను, మత ప్రచారాన్ని అరికట్టబోరాడే విద్యార్థి ఉద్యమ కార్యకర్తలపై యీ నిర్బంధాలకు గురిచేస్తామని అనేకచోట్ల నిరంకుశ విద్యాలయాధికారులు బెదిరిస్తున్నారు.

దేశమంతటా పంజాబు, బెంగాలులలో హిందూ మైనారిటీలపై జరుపబడిన అత్యాచారాలతో తీవ్రముస్లిం ద్వేషం ప్రబల ప్రారంభించింది. ఈ మతద్వేషాన్ని యీ అభివృద్ధి నిరోధకులు ఆంధ్రదేశంలో గూడ వ్యాపింపజేసి మనప్రజాజీవితాన్ని నాశనంజేయచూస్తున్నారు, రాష్ట్రంలోని ప్రజాఉద్యమాల విచ్ఛిన్నపర్చ జూస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ప్రతి అభివృద్ధికాముకుడూ గుర్తించ వలసియుంది. ఆంధ్రదేశంలో మత దురహంకారుల ఆటలు సాగనీయకుండ జేయుటకు ముందుకు నడవవలసి యుంది. ప్రభుత్వం విద్యాలయాలలో మతప్రచారాన్ని నిషేధిస్తూ జారీచేసిన ఆర్డర్లను అమలుపర్చునట్లు ఆందోళన జేయవలసియుంది. ఈ మతప్రచారం వెనుక దాగియున్న ప్రజా వ్యతిరేకశక్తులను బహిరంగపర్చవలసి యుంది. మన ప్రజలలోని జాతీయోద్యమ సత్సాంప్రదాయాలను ముందుకు తీసుకొనిపోవలసి ఉంది. గుడ్డి ముస్లిం ద్వేషంతో నేడు అనేకమంది యువకులు, విద్యార్థులు, ఆర్. ఎస్. ఎస్ విష కౌగిలిలోకి పోతున్నారు. వారిని యీ విష కౌగిలినుండి రక్షించి, దేశపునర్నిర్మాణమునకు సిద్ధపరచవలసిన బాధ్యత నేటి మన ఆంధ్ర కాంగ్రెసుపై యుంది. కాని ఇందుకు ఆంధ్రదేశంలో కాంగ్రెసు పెద్దలు పూనుకో

(మిగతా 3 వ పేజీలో)

ముఖచిత్రం : శ్రీ చండ్ర రాజేశ్వరరావుగారు (ప్రథమ యువజన మహాసభ అధ్యక్షులు)

చిన్న కథ

మనం మనం ఒకటే

'భరద్వాజ్'

ఊరికి దూరంగావున్న మురికి గుంట ప్రక్క గుడిసెలోనుండి గురవయ్య మూలుగు వినిపిస్తోంది. మధ్యమధ్య వులిక్కిపడు తున్నాడు. కలవరిస్తున్నాడు భార్య పరిచర్య చేస్తోంది, కళ్ళ నీళ్ళుపెట్టుకుంది, ఒకళ్ళిద్దరు పిల్లలు బొమికెల గూడులా "కుసుకుసు" లాడ్తూ గుడిసెముందరి గజ్జి కుక్కతో ఆడు కొంటున్నారు.

గురవయ్య కలవరించాడు. "లేదు మస్తానయ్యా లేదు; నాకు బుద్ధిలేదు. తెలవక జంపాను, నివ్ చెప్పినమాట నిజద్దే! నిసంగా మనంమనం వొకటే గెహించాను మస్తానయ్యా గెహించాను" మళ్ళీ కళ్ళు మూసుకొన్నాడు.

భార్యకు యిదేం అర్థం గాలేదు పిచ్చి పిచ్చిగా మొగుడి ముఖంలోకి చూచింది, గుండె మీద చేత్తో నిమిరింది. పొట్టను నిమ్మళంగా నవిరించింది దిక్కుదిక్కుగా గుడిసె నాలుగు ప్రక్కలా చూచింది. మూకుడులేని, అంచు పోయిన పిడతలోనుంచి అన్నం తెల్లగా కనుపించింది మల్లచిప్ప పక్కరాలిన వొకటి రెండు మెతుకుల్ని, విరిగిపోయిన మిరపకాయ తునకను ఎర్రచీమలు బరబరా లాక్కెడు తున్నయ్. మళ్ళీ గురవయ్య కలవరించాడు. ఈతడవ వెర్రిచూపులుగూడా పడ్డయ్.

★

రావుబహద్దర్ రాఘవరావు యింట్లో చాలా మంది కూచొని వున్నారు వాళ్ళముఖాలు జేవురించినయ్. కళ్ళు ఎర్రగా మాంసం ముక్క లకుమల్లే వున్నాయి చమటతో వాళ్ళ వొళ్లు తడిసింది అంతా నిశ్శబ్దంగా వుంది.

రావుబహద్దర్ ఒక్కసారి టోపీ సవరించు కొని వుపన్యాసం మొదలెట్టాడు

"గ్రహించండి! సోదరులారా గ్రహిం చండి!! ఈనాటికైనా మీరు మేల్కోండి!!! బెంగాల్లో మన హిందువుల అగచాట్లను, ఆక్రోశనను, ఆలాపాలను చూడండి మన వాళ్ళ యిళ్ళను ముస్లిం గూండాలు తగుల బెట్టారు. మన పసికందుల్ని బాకుల కొనలకు గుచ్చారు మన గర్భిణీ స్త్రీలను . అబ్బా! చెప్పలేను ."

"చెప్పు చెప్పు" అంది జనం.

"మన గర్భిణీస్త్రీలను వివస్త్రలనుచేసి వారి గర్భాల్ని కరుకుకత్తులతో బ్రద్దలుగా చీల్చారు. కాగడాలతో వారిమర్మావయాలనుకాల్చారు. ....కొడుకు ఎదుట తల్లిని; అన్నముందు చెల్లెలిని భర్తముందు భార్యను క్రూరంగా చెరిచారు, గృహదహనాలు, ఆస్తుల దోపిడి, హత్యలు హాహాకారాలు బెంగాల్ నేడొక నరకకూపం. ఈ దారుణకాండంతా ఎవరి మీదకో తెలుసా? అన్నాడు రావుబహద్దర్,

"తెలియదు తెలియదు" అంది జనం.

"మనమీద — మన హిందువులమీద" అన్నాడు రావుబహద్దర్,

"ఆఁహా" అంది జనం

రావుబహద్దర్ ముఖంలో "తృప్తి" మెరసి మాయమైంది ఇలా అన్నాడు: "మీలో రక్తం ప్రవహించడల్లేదూ?"

"ఎ దుకులేదూ"? అంది జనం.

"మీ రక్తంలో హైందవలాలిమత్వం నసిం చిందా"? అన్నాడు రావుబహద్దర్.

జనం వొక్కసారి వొకరిముఖా లొకరు చూసుకొని ఏకకంఠంతో "నశించలేదు నశించ లేదు" అంది.

రావుబహద్దర్ ముఖంలో ఈసారి "తృప్తి" చాలాసేపు వుంది. మళ్ళీ అన్నాడు. "మీరీ హింసాకాండను సహిస్తారా"?

"సహించలేం సహించలేం" అందిజనం.

"ఐతే ఏం చేస్తారు"? అన్నాడు రావు బహద్దర్,

ఏం చేయాలో తోచక జనం దిక్కులు చూచి తలలు గోకుకుంది. రావుబహద్దర్ అదిరి పోయాడు భయంతో అతని శరీరం కంపించసాగింది. తడబడుతూ "ప్ర.కారం" అన్నాడు.

"ఆఁ ఆఁ ప్రతీకారం" అంది జనం

వెలవెలబోతూన్న రావుబహద్దర్ ముఖం కళ క్లాడింది "మీరంతా బెంగాలుకు ప్రతిగా యిక్కడ కసిదీర్చుకోవాలి. కనపడ్డ ముస్లిం నల్లానరికెయ్యండి ముస్లింపేటలను తగుల పెట్టండి, ముస్లిం గృహాలను లూటీచేయండి. ముస్లిం .... ముస్లిం . ముస్లి ...... ఊఁ! పొండి!! మీ దేశభక్తిని ప్రదర్శిం చండి" అన్నాడు.

జనం లేచింది. చేతికందిన సాధనాల్ని తీసుకొంది. ముస్లిం పేటలపై బడింది. గుర వయ్య మడ్డికత్తి తీశాడు. గుడిసెల్లోనుండి ఒక్కొక్క ముస్లిమునీ లాక్కొచ్చి మడ్డి కత్తితో నరికాడు నెత్తురుతో అతని శరీరం తడిసింది. పేగులతో చేతులు బరువెక్కాయి మడ్డికత్తి మొద్దుబారింది. దానివైపు చూసి "పెతీకారం పెతీకారం" అని అరిచాడు. శవా లను తొక్కుకుంటూ ముందుకు పోయాడు.

తోటికూలీ మస్తాన్ రొజుకుంటూ అతని వైపు పరుగెత్తుకొచ్చాడు. గురవయ్య అతన్ని ఆపుజేసి మడ్డికత్తి ఎత్తాడు

"గురవయ్యన్నా! నువ్వుకూడానా? ఏమి టిది?" అన్నాడు మస్తాన్.

"పె తీ కా ర ం పెతీకారం" అన్నాడు గురవయ్య.

"ఎవరిమీద?" అన్నాడు మస్తాన్.

"మీమీనే ...చాయిబులమీన" అన్నాడు గురవయ్య

"ఎందుకూ?" అన్నాడు మస్తాన్.

గురవయ్య తల గోక్కున్నాడు. చేతిలో కొచ్చిన వొకటి రెండు మాంసం ముక్కల్ని దూరంగా విసిరి, మడ్డికత్తి దించాడు.

"అన్నాయ్! ఎక్కడో జరిగిందానికి మా మీనా ప్రతీకారం? మే మేం చేశాం? ఎందుకు నువ్విట్లా దారుణకృత్యానికి తలపడ్డావ్? నువ్వా కూలీవి, నేనూ కూలీని నీకూ గుడిసెదప్ప గత్యంతరంలేదు నాకూ అంతే నీ భార్యా బిడ్డలకు త్రాగడానికి గిద్దెడుగంజి! వొక్క గిద్దెడు గంజి లేక మలమల మాడుతున్నారు. నా భార్యా బిడ్డలూ అంతే. మానాన్ని రక్షించు కునే దానికి మూరెడు గుడ్డ లేక నీవు అల్లాడు తున్నావ్ నాకు.... యిదిగో చూడు యీ ముంజా వాననకొట్టే గుడ్డపప్ప మరోటిలేదు యిద్దరం వొకే పరిస్థితిలో వున్నాం. యిద్దరం దారిద్ర్యంలో కుళ్ళిపోతున్నాం. నీకూ నాకూ భేదమెక్కడ? నీవు హిందూవి, నేను ముస్లింని. అయినా దరిద్రం మనలనిద్దరనీ సమం చేసింది, మొన్న రావుబహద్దర్ మిల్లులో సమ్మె జరిగితే అతనేం చేశాడు. తుపాకిబెట్టి కాల్పించాడు. లారీలతో మోదించాడు దొంగచాటుగా కూలీలను ఖూనీ చేయించాడు. రాగప్ప మీ హిందూవేగా! అర్థరా

(2 వ పేజీ తరువాయి)

త్రప్పుడు అతని గుడిసెను తగలబెట్టించలా? మనం అడిగింది మూడణాల ఎక్కువ కూలి. అతని లాభంలో వెయ్యోవంతు తగ్గించుకుంటే సరిపోతుంది. మళ్ళీ ఆ మిల్లులో పని చేసేవాళ్ళల్లో ఎక్కువమంది హిందువులే! అయినా మూడణాల కూలి ఎక్కువిచ్చాడా? ఆనాడు ఎక్కడకు బోయిందీ అభిమానం? ఎక్కడకు బోయిందీ వాత్సల్యం?... చెప్పు భాయీ! ముస్లిములమీద అంతద్వేషం వున్నప్పుడుమిల్లు భాగస్తుడు అబ్దుల్లాకు విన్నసాయంత్రం టీపార్టీ యివ్వడమెందుకు? అతన్నేమీ అనదేం రావుబహద్దర్? చెప్పు భాయీ చెప్పు. ఏ నాటికైనా డబ్బుగలోళ్ళందరూ ఒకటి కూటికిలేని దరిద్రులు హిందువులైనా, ముస్లిములైనా వొకటి. హిందూ, ముస్లిం మతాలనుజూచి, దరిద్రం ఆవహించదు. కడుపులుమాడే మనం ఏ మతానికి చెందినా, ఏ కులానికి చెందినా ఒకటే ఏమంటావ్ గురవయ్యన్నా"

గురవయ్యకు మెదడు తిరిగింది. కాదు కాదు మెదడు గడ్డకట్టింది పేరుకు పోయింది రక్తం పల్చబడింది. చేతిలోని కత్తిని దూరంగా విసిరి తూలుకుంటూ గుడిసెలోకొచ్చి కూలబడ్డాడు. భార్య గురవయ్య ఆకారాన్ని చూచి భయపడింది నెత్తుటిమరకలు! ప్రేగుల తునకలు!! మాంసం ముక్కలు!!!

మంచంపై పండుకోబెట్టింది. గురవయ్య కలవరించాడు "లేదు మత్తానయ్యా లేదు. నాకు బుద్ధిలేదు. తెలవక జంపాను. నివ్ సెప్పినమాట నిజద్దే! నిజంగా మనం మనం వొకటే గెహించాను. మత్తానయ్యా గెహించాను," కళ్ళు మూసుకున్నాడు.

భార్యకు యిదేం అర్థంగాలేదు. పిచ్చిపిచ్చిగా మొగుడి ముఖంలోకి చూచింది. గుండెమీద చేత్తో నిమిరింది. పొట్టను నిమ్మళంగా సవరించింది. బిక్కు బిక్కుగా గుడిసె నాలుగు ప్రక్కలా జూచింది. మూకుడులేని, అంచుబోయిన పిడతలోనుంచి, అన్నం తెల్లగా కనుపించింది. మల్లె చిప్పపక్కగా రాలిన వొకటి రెండు మెతుకుల్ని విరిగిన మిరపకాయ నవకను, ఎర్రచీమలు బరబరా లాక్కెడుతున్నయ్ మళ్ళీ గురవయ్య కలవరించాడు. "... నివ్ సెప్పినమాట నిజద్దే మత్తానయ్యా! నిసంగా మనం మనం వొకటే! గెహించాను గెహించాను"

[అనుకరించాము గోపీచందు పద్ధతిని. ధనాస్వంతం: కానీ "గోర్కీ" కూడా మీకిందులో కనిపిస్తారు.]

మచ్చుతునకలు ★ చిచ్చురవ్వలు

(ఇకమీదట యీశీర్షిక క్రింద మా'అగ్నికణం' మచ్చుతునకలు ఏరి చిచ్చురవ్వలను చల్లుతూ వుంటుంది —సంపాదకుడు)

"బందరుప్రిన్సిపాల్ రివాల్వర్‌కు లైసెన్సు పొందాడు" — రూఢి భోగట్టానుండి

ఇదివరలో తన అధికార హస్తాన్ని మండించి అనేక విద్యార్థి జీవితాలను బలిగొన్న భస్మాసురుడీ బందరు ప్రిన్సిపాల్, మరి యీ రివాల్వరుతో ఎంతమందిని పొట్టపెట్టుకొంటాడో యీ ప్రబుద్ధుడు!

ఓన్వ స్తికనేస్తా! దిరెన్ననోపానకా!! ఎల్లకాలంమనదికాదండోయ్! నీరక్తసిక్తహస్తాలు నీకే చేటుతెస్తాయ్ సుమా! తస్మాత్ జాగ్రత జాగ్రత!

* * *

"బెజవాడ కాలేజీలో సరియైన లేబరేటరీ నిర్మాణం జరగకపోవటం వలన, తగినంత మంది లెక్చరర్లు లేకపోవటం వలన పాఠాలు క్లాసులువెనుకబడ్డాయి దానిపై సెలవుల్లో ప్రయివేట్ పెట్టడానికి కొంతమంది సహృదయులైన లెక్చరర్లు అంగీకరించి నోటీసు పంపారు. ఆ నోటీసును రద్దుచేస్తూ, ఆర్ ఎస్ ఎస్. ట్రయినింగు క్యాంపుకు బెజవాడ కాలేజీనిప్రిన్సిపాల్. మేనేజిమెంటులు ధారాదత్తంచేశారు"

— ప్రకటన భాగం.

ఆర్. ఎస్ ఎస్. గూర్చి అంతగాచెప్పాల్సిన అవసరంలేదు. ఇది హెర్‌హిట్లరు నెత్తిమీదుగా అవతరించిన పవిత్ర సంస్థ. ప్రస్తుతం దీని కార్యక్రమం నెహ్రూ ప్రభుత్వాన్ని కూలదోయటం. మతకలహాలను రెచ్చగొట్టడం

— బెజవాడ కాలేజీ ప్రిన్సిపాల్ కొద్ది రోజుల కిందట అమాంతంగా ఆర్ ఎస్ ఎస్ అభిమానిగా మారిపోయారు. మారిపోయి విద్యకు భంగం వాటిల్లేరీతిగా ప్రవర్తిస్తున్నారు. విద్యకు ప్రత్యేకించబడ్డ విద్యాలయాన్ని కర్ర, కత్తి సాములాలగా మార్చేశారు ఎట్టి సంకోచం లేకుండా!

ఇక చుండూరి వెంకటరెడ్డిగారిని గూర్చి వేరే పరిచయమేల? ప్రఖ్యాతిగాంచిన దొంగ వ్యాపారి. పేరుమోసిన పెట్టుబడిదారుడు. [redacted]!! అందుకు విద్యాలయాలను చేపట్టారు. మరి హంగుబలంకోసం ఆర్. ఎస్ ఎస్. కు 'మహారాజపోషకు' డయ్యాడు.

మిస్టర్ చుండూరితో పోటీచేయగల సమర్థుడునూజివీడు 'మహారాజు' బెజవాడకాలేజీని పై ప్రముఖు లిద్దరు "జాయింటు ఫరమ్"గా నడుపుతున్నారు ఈ జమీందారుకు మరిరెండు స్కూళ్ళపై — నూజివీడు, వానపాముల — కూడ అధికారముద్ర వుంది. వీటి విషయంలో తమ చిత్తం వచ్చినట్టు మెలగుతున్నారు. ఈ జమీందారుకూడ "ఆర్. ఎస్. ఎస్." కు రాజపోషకులే

అట్టి పై 'త్రిమూర్తుల' పవిత్ర కలయికవల్ల పై కార్యం జరిగింది! పై కార్యానికి విద్యాలయాలలో మత ప్రచారం కూడదన్న ప్రభుత్వ తాఖీదు అడ్డంరాలేదు! విద్య అసలు దృష్టిలోనే లేదు!!

మరి యిప్పుడు ప్రభుత్వం ఏమంటుంది?

దేశభక్తిగల విద్యార్థులు యీ అఘాయిత్యానికి ఎటువంటిజవాబు చెప్పుతారో?

జై విశాలాంధ్ర
"అగ్నికణం"

(మొదటి పేజీ తరువాయి)

కుండుట విచారకరం. యువకులు, విద్యార్థులు కలకత్తా విద్యార్థులు జూపిన ఐక్యబాటను ముందుకు సాగుతూ ఆంధ్రదేశాన్ని మత కలహాలనుండి రక్షించుతారని ఆశిస్తాం.

ఆంధ్రదేశంలో మతకల్లోలాలు వ్యాపించకుండా కృషిజేయుటకు యువకులలోను, విద్యార్థులలోను ఐక్యత అత్యావసరం. మతకల్లోలాలను ప్రతిఘటించుటకు, నెహ్రూ ప్రభుత్వంను బలపర్చుటకు కంకణం కట్టుకొనిన యువజన, విద్యార్థి కాంగ్రెసు సోదరులు అట్టి యువజనోద్యమ ఐక్యతకు తోడ్పడుతారని ఆశిస్తాం. యువజనోద్యమ ఐక్యతతో దేశ పునర్నిర్మాణమునకు తోడ్పడి ఆంధ్రదేశానికి మతకలహాల ప్రమాదం లేకుండా విద్యార్థులు, యువకుల రక్షిస్తారని విశ్వసిస్తాం.

ప్రజాతంత్ర రాజ్యస్థాపనకోసం

నిరంకుశ నైజాము నవాబు విసరిన సవాలును హైద్రాబాద్ విద్యార్థులు అకుంఠిత ధైర్యంతో ఎదుర్కొన్నారు. ఒక్క విద్యార్థి హక్కుల రక్షణకోసము మాత్రమేకాక ఒక కోటి 70 లక్షల నైజాం ప్రజానీకం యొక్క న్యాయభరిత హక్కులకు అండదండిగా నిలబడ్డారు. నేడు హిందూ ముస్లిం యువతీ యువకులలో ఒక్కమారు రగిలిన స్వాతంత్ర్యాగ్నిని ఆర్పేందుకు ఆఖరి ప్రయత్నాలను చేస్తున్నారు ప్రజల గర్భశత్రువులైన నవాబు అతని తొత్తులైన జాగీర్దార్లను ఎదిర్చిన సంగ్రామ ప్రథమ శ్రేణిలో నిలబడి స్వాతంత్ర్యజ్యోతిని ఉన్నత పథాలకు గొనిపోతున్న విద్యార్థి వీర కిశోరాలను గాంచి మేమెంతగానో గర్వపడుతున్నాము. విద్యార్థులంతా తమ పవిత్ర సంకల్పముద్వారా అపార ఆత్మార్పణ ద్వారా ఈ స్వాతంత్ర్య జ్యోతిని దేదీప్యమాన పర్చారు. నైజాం నవాబు, వాని పరాన్న భుక్కులను పరిమార్చే వరకు ఈ జ్యోతి అద్వితీయంగా అఖండంగా వెలుగొంది తీరుతుంది.

అయితే నిన్న మొన్నటి వరకు పాలబుగ్గలాని పసిప్రాయులైన ఈ విద్యార్థులకు ఇంతటి పోరాట పటిమ ఎలా అబ్బింది. నైజాం పోలీసులు, గూండాల మిలటరీ దారుణ హింసాకాండను బాలచంద్రులై ఎట్లా ఎదిర్చిపోరాడగల్గుతున్నారు. పోలీసులాఠీలను గూండాల తొత్తులను ఏశక్తితో ఎదుర్కొనగల్గుతున్నారు. టియర్‌గ్యాస్ బాంబులవల్ల మరఫిరంగులవల్ల ఈ యువక సింహాలకు ఇసుమంత భయముకూడా లేదే! ఎందువల్ల?

సమాధానము కోసము ఒకసారి హైద్రాబాదు సాగిరండి. తరలి రండి. నైజాం నవాబు సృజించిన నాజీ నరకకూపము నాల్గు గోడల మధ్య ఏమి జరుగుతూంది? అదుగో రెండువందల సంవత్సరముల క్రితము అవతరించిన అసఫ్‌జాహీ కుటుంబానికి వారసుడు నేటి నవాబు. అదుగో! నవాబు సృష్టించుకున్న వందలాది జాగీరుదార్లు, పట్వారీలు.

ఈ మానవ నరహంతకులంతా గుమిగూడి హైదరాబాద్ సామాన్యప్రజానీకాన్ని, రైతాంగాన్ని, చెప్పరాని ఘోరహింసలకు గురిచేశారు. ప్రజలను కాలరాచారు. కొల్లగొట్టారు. కాల్చి చంపారు. దోచేసారు. తత్ఫలితంగా హైద్రాబాద్ ప్రజానీకము నేడు నిర్జీవ ప్రతిమలా తయారైంది. పతనాన్ని కౌగలించుకొనే ముందు ప్రతి దోపిడీముఠా చేసే మారణహోమాన్ని ఈ యమకింకరుడైన నవాబు బ్రిటీషువాళ్ళ సహాయసంపత్తితో సాగించాడు.

నైజాం దోపిడికి ఆయువుపట్టు నేడు అమలులో నున్నలోప భూయిష్ట విద్యావిధానము. తెలంగాణ ఆంధ్రుల మహారాష్ట్రుల, కన్నడ, ప్రజలను వారివారి గత స్వర్ణ చరిత్రలకు ఎడబాటు గల్గించింది. వైజ్ఞానిక, సామాజిక ఔన్నత్యాన్నికి దూరము చేసింది ప్రస్తుత విద్యావిధానము తద్వారా నవాబు వాని కీలుబొమ్మలు

ఓంకార్ ప్రసాద్

కార్యదర్శి,
అఖిల హైద్రాబాద్ విద్యార్థి సంఘం

ప్రజలపై అధికారాన్ని ముద్రవేసికొని కూర్చున్నారు. అందువల్ల ప్రజలు ఆర్థికంగా వెనుకబడ్డారు. వైజ్ఞానికంగా ముందుకు రాలేక పోయారు.

ముఖ్యంగా గత 50 సంవత్సరాలుగా ప్రజల విజ్ఞాన సంపత్తిపై దాడిచేసి తోసేశారు. వైజ్ఞానిక, సామాజిక అభ్యున్నతిని నిరంకుశంగా అణచివేశారు. తెలుగు, కన్నడ, బాషలలో ప్రజలకు విద్యగరపటానికి స్వస్తి చెప్పబడింది. 12 ఏండ్లు నిండని కడుపసిపాపలు సైతము తమ మాతృభాషకు తిలోదకాలిచ్చి ఉరుదులోనే చదువు నేర్చుకోవాలి, హైద్రాబాద్ అంతటికి ఒకే ఒక విశ్వవిద్యాలయము. అదికూడ అన్ని అవసరాలను తీర్చలేని అసమర్థ విశ్వవిద్యాలయము. పైగా ఉరుదులో విద్యా బోధన, ఏదో నామమాత్రంగా తెలుగు, మరాఠి, కన్నడ, భాషలను పాఠ్య భాషలుగా అంగీకరించారు. కాని అత్యవసరమైన విద్యా బోధన మాత్రము మాతృభాషలోగాక ఉరుదులో జరగడంవల్ల అత్యధిక విద్యార్థులు అతికష్టంపై ఉరుదును నేర్చుకోవడము తప్పనిసరి అవుతున్నది.

విద్యాసౌకర్యాలు మాత్రము శూన్యం చేయబడ్డాయి. 20 సంవత్సరములనుండి పన్నురూపేణా ఆర్జించబడ్డ కోట్లాది రూపాయలను ఏవో అతుకు పోతకు అందని ప్లానులకు దుర్వినియోగపర్చడం జరిగినది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి సాధించిన ఘనవిజయమేమిటి? అక్షరాస్యత 2%నుండి 6% కు ఒక్క "గంతు" వేసింది! ఎంతటి అమోఘవిజయం!!

కాని విద్యార్థులు మాత్రము కనువిప్పుగలిగి మెలుగుతున్నారు. ఈ లోపభూయిష్ట విద్యావిధానము ఎందుకోసము ఎవరికోసము ప్రవేశపెట్టబడిందో గ్రహించారు, ఈ విద్యావిధానం తమ హృదయక్షేత్రాలలో ఏ విధంగా అజ్ఞానాన్ని అమాయకత్వాన్ని సాగుచేస్తోందో తెలిసికొన్నారు మతవైషమ్యాలను ఎలా పెంపొందిస్తోందో, వైజ్ఞానికాభివృద్ధిని ఎలా ఆటంకపరుస్తోందో అవగాహన చేసికొన్నారు. మణిముత్యమువంటి తమ మేధాసంపత్తిని కొల్లగొడుతున్నారని గ్రహించారు.

ఇంత అఘాయిత్యానికి పాల్పడ్డ పై నైజాం నాజీ నరహంతక ముఠాయే "నేనూ ఒకుదు నమ్మా" అంటూ "స్వాతంత్ర్యాన్ని" ప్రకటిస్తోంది. తమ బ్రిటిషు యజమానుల కుట్రలలో భాగస్వాములై అభివృద్ధినిరోధక కూటమిని తన సంస్థానములో నిర్మించేందుకు తయారైంది. ఈ విధంగా ప్రజాతంత్ర ఇండియన్ యూనియన్ హృదయానికి సూటిగా తన మరఫిరంగిని గురిపెట్టుకు కూర్చున్నాడు. కాని హైద్రాబాదు వీరప్రజానీకము మాత్రము బ్రిటీషు నైజాము సంయుక్త కుట్రలను సహించబోవుటలేదు. తమ శక్తినంతా క్రోడీకరించి మధ్యయుగమునాటి నాజీ నిరంకుశత్వానికి ఆయువుపట్టుపై దెబ్బతీయటానికి ఆయత్తమయ్యారు.

హైద్రాబాదు స్టేటు కాంగ్రెసు, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టుపార్టీ, ట్రేడు యూనియన్ కాంగ్రెసు, విద్యార్థిసంఘము — ఇంతెందుకు స్వాతంత్ర్యప్రియు లందరిచే ప్రారంభించబడ్డ ఈ పవిత్ర సంగ్రామానికి విద్యార్థులు పురోగాములుగా నిలబడి సమరాన్ని సాగిస్తున్నారు

పవిత్ర ఆగస్టు 15 వ తేదీని విద్యార్థుల

తమ శక్తిని నైజాం నవాబుకు చవి చూపించారు. ఒకప్రక్క నైజాం నవాబు, అతని బూట్లునాకే కుక్కలు "స్వతంత్ర హైదరాబాదు" అని అదిరిపడి చస్తున్నారు. మరోప్రక్క అఖిల హైద్రాబాద్ విద్యార్థి నాయకులు రఫీ అహ్మద్ విద్యార్థిసంఘ ఆఫీసుపై ధైర్యంగా మూడురంగుల జండా ఎగురవేశారు పోలీసు బందోబస్తు ఎందుకు పనికిమాలినదైనది ఇది హైద్రాబాద్ విద్యార్థులకు పోరాటసిగ్నల్‌లా పనిచేసింది వెంటనే ఔరంగాబాద్, వరంగల్ నల్లగొండ, తమామ్ భోంగీరు నాందేడ్ మొదలయిన పలుప్రాంతాలలో విద్యార్థులు కార్యరంగానికి అగ్రరూపము దాల్చి ఉరికారు ఒక్క హైద్రాబాదులోనే ఒక్క నెలలో— సెప్టెంబరు 2,8,15 తారీఖులలో— 3 పర్యాయములుగా— వేలాదితో గూడిన ప్రజా సంరంభము పోలీసుల నోళ్ళకు తాళాలు వేసింది త్రివర్ణపతాక తేజస్సును ప్రజాతంత్ర నిర్మాణత్వాన్ని కాపాడటము కోసము బద్ధ కంకణులైన విద్యార్థి వీరులకు ఈ లాఠీచార్జీలు టియర్‌గ్యాస్ బాంబులు గూండా దౌర్జన్యము తృణప్రాయమైనవి ముక్తకంఠముతో నిరంకుశత్వానికి స్వస్తివాచకము చెప్పేందుకు సంకల్పబద్ధులయ్యారు. బాధ్యతాయుత ప్రభుత్వ నూతన యుగానికి నాంది, ప్రస్థావనల నాలాపించారు.

42 లక్షల మహారాష్ట్రుల మోక్షానికి జరిగే మహత్తర సంగ్రామం. 22 లక్షల కన్నడ ప్రజల బానిస శృంఖలాలను ఛేదించేందుకు జరిగే సంకులసమరం, 20 లక్షల ముస్లిం ప్రజానీక అభ్యున్నతికి జరిగే అపూర్వ సంగ్రామం ఆంధ్ర మహారాష్ట్ర, కన్నడ జాతీయుల ఔన్నత్యానికి కీలకస్థానాలు నైజాం నవాబు చేజిక్కించుకొన్నాడు ఆ కీలక స్థానాలను ఈ నైజాం ముష్కర మలిన హస్తాల నుండి విముక్తిచేసేందుకే ఈ సర్వతోముఖ సంగ్రామం

హైద్రాబాద్ విద్యార్థులు ఆత్రుతతో తమ సోదర విద్యార్థుల-నైజాం నిర్మించిన అసహజ అడ్డుగోడల వెలుపలనున్న విద్యార్థుల-వైపు సాయంకోసం ఎదురుచూస్తున్నారు. "ఇండియన్ యూనియన్" ప్రజలు సాధించిన ఘన విజయ ఫలితాన్ని తమకు పంచిపెట్టమని అర్థిస్తున్నారు నైజాం నవాబును హతమార్చటానికి తాము బాధ్యత వహించారు మీసహాయ సానుభూతికోసం ఎదురుచూస్తున్నారు మేము మీరు కలసి భారత స్వాతంత్ర్యాన్ని సుస్థిరం చేద్దాం అంటూ తమ స్నేహ హస్తాన్ని మీవైపు చాస్తున్నారు

అందువల్ల సహజంగా ఆంధ్ర విద్యార్థుల నుండి సహాయాన్ని అర్థిస్తున్నారు కూలిపోయే నైజాం ప్రభుత్వాన్ని త్వరితగతిని కూల్చేందుకు ఆతురతపడుతున్నారు తద్వారా విశాలాంధ్ర నిర్మాణానికి జ్యోతిర్మయ భవితవ్యానికి సాయపడతామని పూచీపడుతున్నారు

హైదరాబాద్ విద్యార్థుల సంగ్రామం

ఈ అప్రతిహత పోరాటంలో రెండు వందలమంది విద్యార్థులు జైలుకు వెళ్ళారు, సమరాధినేతలయిన అఖిలహైద్రాబాద్ విద్యార్థి నాయకులపై వారంట్లు పుట్టాయి. ఇంతేగాదు పసిపిల్లలను సైతము జైళ్ళలో క్రుక్కి ఘోరముగా హింసించారు. కాని విద్యార్థుల దీక్ష, లక్ష్యాలు చలించనవి. ప్రభుత్వ దమన నీతి విద్యార్థుల దీక్షను దృఢతర మొనర్చినది సంకల్పమును ఇనుమడింప చేసినది నవాబుపై నున్న అసహ్యత అగ్నిపర్వతములా బ్రద్దలైంది, చైతన్యాన్ని ఆస్వాదించుకొని నలిపే ఉధృత సంగ్రామము ఒక్కకోటి 70 లక్షల ప్రజల స్వాతంత్ర్య సమరము మాత్రమేగాదు, ఇది 80 లక్షల తెలంగాణా ఆంధ్రుల విముక్తి కోసము జరిగే మహోన్నత పోరాటం.

మనందరి శత్రువు ఒకడే అందువల్ల మనమంతా ఒక్కుమ్మడిగా పోరాడాలి తద్వారా మనశక్తిని ఇనుమడింపచేసుకోవాలి అందువల్ల మీ తెలంగాణ ఆంధ్రులకు అన్ని విధాల సాయపడండి నైతికబలముకోసం పెద్ద వుద్యమాన్ని నిర్మించండి నిధులను విధిగా ప్రోగుచేయండి వైద్యసహాయాన్ని పంపండి ఇది మీరు చేస్తారని మాకు పూర్తి నమ్మకముంది విజయం ముమ్మాటికీ మనదే

★

జోహార్లు

కామ్రేడ్ కామినేని వెంకటకృష్ణారావుది కైకలూరు తాలూకా గోపవరం గ్రామం తాను కైకలూరు స్కూలులో చదువుతున్నపుడు విద్యార్థి ఉద్యమంతో సంబంధం ఏర్పడి విద్యార్థిరంగములో ముందుకొచ్చి విద్యార్థి ఫెడరేషన్ కార్యకర్తలలో ఒకరై మూడు సంవత్సరములు కైకలూరు విద్యార్థి ఫెడరేషనుకు నాయకత్వం వహించి నడిపాడు కామ్రేడ్ కృష్ణ బందరు కాలేజీలో చేరగానే టైఫాయిడ్ జ్వరానికి గురై అసువులను గోల్పోయాడు కామ్రేడ్ కృష్ణ విద్యార్థి ఉద్యమానికి చేసిన సేవ మరపుకు రానిది ఈ కామ్రేడ్ ఏ ఆశయంకోసం విద్యార్థి ఉద్యమంకొరకు పాటుపడ్డాడో ఆ ఆశయాన్ని ఆంధ్రవిద్యార్థిలోకం నెరవేర్చుతుందని శపథం చేస్తూ యీ కామ్రేడు అకాలమరణానికి చింతిల్లుతూ అతని కుటుంబానికి మా హృదయపూర్వక సానుభూతు లందిజేస్తున్నాం

★

కామ్రేడ్ సి హెచ్. హనమంతరావు ఒంగోలు హైస్కూలులో చదువుతూన్నప్పుడే విద్యార్థి ఫెడరేషన్‌లోచేరి విద్యార్థుల హక్కుల కోసం ఎడతెగని కృషిసల్పాడు క్రిందటి సంవత్సరం బెజవాడ కాలేజీలోచేరి విద్యార్థి లోకం యొక్క కంటిలో పాపవలె మెలిగాడు, అందుచేతనే క్రిందటి సంవత్సరం కాలేజీ హాసలు కార్యదర్శిగాను యీ సంవత్సరము కాలేజీ యూనియన్ కార్యనిర్వాహక వర్గ సభ్యుడుగాను ఎన్నుకోబడి అతని శక్తివంచన లేకుండా విద్యార్థి సేవ చేస్తున్నాడు ఈ కామ్రేడ్‌ను వారంరోజులక్రితం టైఫాడ్‌జ్వరం పొట్టను బెట్టుకుంది హనుమంతరావు మృతికి చింతిల్లని కాలేజీ విద్యార్థిలేడు. ఈ కామ్రేడ్ విద్యార్థి ఫెడరషన్‌లోచేరి ఏ ఆదర్శానికై కృషిచేస్తున్నాడో ఆ ఆదర్శాన్ని నెరవేర్చువరకు ఆంధ్రవిద్యార్థిలోకం నిద్రించదని శపథంచేస్తూ యితని అకాల మరణానికి చింతిల్లుతూ కుటుంబమునకు మాహృదయపూర్వక సానుభూతుల నందచేయుచున్నాము.

ఆంధ్రరాష్ట్ర విద్యార్థి ఫెడరేషన్.

ఆసనాలు వేసేదెలా?


శ్రీ కోన వెంకటేశ్వరరావు

శలభాసనము

5 వ పటము

చేయువిధము:—

చాపపై దుప్పటిని పఱచి బోర్లపరుండవలెను. చేతులను ఇరుప్రక్కలకు చాచి గుప్పిటలను మూసి పైకి త్రిప్పియుండునట్లు పెట్టుము. మెల్లగా కాళ్ళను, ఆ వెనుకతుంటివి బొడ్డు క్రిందభాగమును పైకి లేపనెత్తవలెను. శరీరముయొక్క బరువంతయు రొమ్ముపైనను చేతులపైనను యుంచవలెను. ముఖమును కొద్దిగా పైకి ఎత్తుము ప్రారంభమునందు 10 సెకండు మాత్రమేచేసి క్రమక్రమముగా ఎంతసేపు శ్వాసను నిల్పగలవో అంతవరకు చేయవచ్చును. రోజునకు నాలుగైదుసార్లు చేయవచ్చును కాని ఊపిరితిత్తులకు ఏమాత్రమూ అధికశ్రమ కలిగించరాదు.



శలభాసనము

ఉపయోగములు:—

శలభాసనము మలబద్ధమును తొలగించును. మూత్రపిండములు బాగా పనిచేయునట్లు చేయును. పొట్టకు సంబంధించిన వ్యాధులు నశించును. జీర్ణశక్తి వృద్ధిచేయును. రొమ్మునకును, కాళ్ళకును మంచిబలము కల్గును.

ధనురాసనము


6 వ పటము

చేయువిధము:—

దుప్పటిపై బోర్ల పరుండవలెను. కాళ్ళను మోకాళ్ళవద్ద వెనుకకు వంచవలెను. చేతులను వెనుకకు చాచి పాదములను చీలమండలవద్ద గట్టిగా పట్టుకొనవలెను. రెండు మోకాళ్ళను ఒకదాని కొకటి దగ్గరగా యుండవలెను. ఇప్పుడు శరీరము యొక్క బరువంతయు పొట్టపై నుండును. గాలిపీల్చుచు విడుచుచుండవచ్చును. ఈ ఆసనములో వెనుకకు ముందునకు ఊగవచ్చును. అది యింకను ప్రయోజనకరము.

ఉపయోగములు:—

ధనురాసనము మలబద్ధమును పోగొట్టును; అజీర్ణము, ప్రేవులు జారుట; నడుమునొప్పి మొదలగు వ్యాధులను నివారించును. వాతశరీరముగల స్త్రీ పురుషులు ఈ ఆసనము చేయుటవలన నివారించుకొనగలరు.



ధనురాసనము

పశ్చిమోత్తానాసనము

7 వ పటము

చేయువిధము:—

దుప్పటిపై కూర్చొని కాళ్ళుచాచవలెను. మెల్లగా శిరమువంచి పొట్టనువెనుకకులాగుతూ రెండు చేతులతో కాళ్ళ బొటనవ్రేళ్ళను పట్టుకొనవలెను. కాళ్ళు నేలకు అనుచూ నిటారుగా ఉండవలెను. తలను మెల్లగావంచుచు ముఖముతో మోకాళ్ళను తాకవలెను, ఈ ఆసనము చాలా జాగ్రత్తగాను నెమ్మదిగాను చేయవలెను. ప్రారంభమునందు 2 సెకండ్లు మాత్రమే చేసి క్రమేపీ 10 నిముషములవరకు పెంచవలెను.

ఉపయోగములు:—

తొడలందుగల కండరములకును; జీర్ణాశయపు కండరములకును ఈ ఆసనము మంచి బలము నొసగును. వాతశరీరమును హరించును. వీర్యమునకు పుష్టినిచ్చును మలబద్ధకము, అజీర్ణము పొట్ట ఉబ్బరింపు; నీళ్ళవిరేచనములు మొదలగు వ్యాధులు నశించును. మధుమూత్రం; మొలలనుగూడ పారద్రోలును. ఈ ఆసనమును క్రమము తప్పకుండా చేయుచున్న యెడల ముసలితనమువలన భయమే పొందనక్కరలేదు.

మయూరాసనము

8 వ పటము

చేయువిధము:—

దుప్పటిపై మోకాళ్ళను మోపి కూర్చొనవలెను. ముందుప్రక్క రెండు అరచేతులను నేలపై మోపవలెను. మోచేతులను ఒకదాని కొకటి దగ్గరగా యుంచవలెను. మెల్లగావంగి పొత్తికడుపును రెండు మోచేతులపై ఆనించి



పశ్చిమోత్తానాసనము

వెనుక తొడలను, మోకాళ్ళను, కాళ్ళనుపైకి లేపవలెను. కాళ్ళను నిటారుగా చాచుట ముఖ్యము. ముఖమునుగూడా పైకి ఎత్తి యుంచవలెను. మొదట గాలిని ఎంతవరకు బిగబెట్టి యుంచగలమో అంతవరకు చేయవలెను. తరువాత ఈ ఆసనము చేయునపుడు గూడా గాలి పీల్చుచూ వదలుచుమండవచ్చును. మొదట్లో 3 సెకండ్లతో ప్రారంభించి 3 నిముషములవరకు చేయవలెను.

ప్రయోజనములు —

మయూరాసనము జీర్ణశక్తిని మిక్కిలి ఎక్కువగా వృద్ధిజేయును మలబద్ధకమును పూర్తిగా నివారించును. పొట్టకు, ప్లీహమునకు, మూత్రపిండములకు ప్రేవులకు సంబంధించిన వ్యాధులన్నియు నివారణయగునట్లు చేయును. ఇంకనూ మూలశంక, మధుమేహము, మొలలు మొదలగు వ్యాధులను నిర్మూలించును చేతులను, భుజములను బలిష్టములుగా జేయును.

హలాసనము

ఈ ఆసనముచేయు విధము నాగలిని పోలి యుండును.

చేయువిధము;—దుప్పటిపై వెల్లకిలపడుండవలెను చేతులను ప్రక్కకుచాచి యుంచవలెను కాళ్ళను నిటారుగాచాచి మెల్లగా లేవనెత్తి తలవెనుకకు పోనీయవలెను. గడ్డం రొమ్మును అనువరకు కాళ్ళను వెనుకకు పోనివ్వవచ్చును కాళ్ళను ఏమాత్రము వంచరాదు చేతులను లేవరాదు చాలా నెమ్మదిగాను జాగ్రత్తగాను చేయవలెను

ఉపయోగములు — వెన్నెముకకు మంచి బలమునిచ్చును. మధుమూత్రము, నీళ్ళ విరేచనములు, మలబద్ధకమును నివారించును. జీర్ణశక్తిని వృద్ధిచేయును. భుజంగాసనము చేయుట వలన కల్గు ప్రయోజనములన్నియు దీని వలన గూడ పొందనగును


శవాసనము

ఆసనము లన్నియు చేయుట పూర్తియైన వెంటనే శవాసనము చేయవలెను

చేయు విధము — దుప్పటిని పరచి దానిపై వెల్లకిల పరుండవలెను. కాళ్ళను చేతులను గాలిలో వదలుగా చాచవలెను. కండ్లు మూయవలెను. కాని నిద్రపోరాదు. మనస్సు నిర్మలముగా నుండవలెను. ఆసనములు చేయుటవలన కల్గిన అలసటను తీర్చుకొనవలెను

ఉపయోగములు —శరీరములోని కండరములన్నియు విశ్రాంతిని తీసుకొనును. క్రొత్త శక్తిని, కాంతిని పెంపొందించును.

ఇంతవరకు ముఖ్యమైన ఆసనములను గురించియు, వాటిని చేయు పద్ధతులు, వాటి వలన శరీరమునకు గల్గు ప్రయోజనములను గూర్చియు వివరించబడినవి. ఈ ఆసనముల వలన పూర్తి లాభములను పొందవలయునన్నచో కనీసం ఒక సంవత్సరంవరకైనా విడవకుండా క్రమముతప్పకుండా చేయవలెను. ఇందులో వివరించబడిన ఆసనములను స్వయముగా ఇతరుల సహాయము లేకుండనే చేయవచ్చును



మయూరాసనము

ఆహార నియమములు — ఆసనములను చేసిన తరువాత ఒకగంటలోపల ఆహారమును తీసుకొనగూడదు. ఆహారములో నైననూ వచ్చుళ్ళు,మసాలాలు, చేదుపదార్థములు పూర్తిగ విసర్జించవలెను. పుష్టికరమైనవియు, సులభముగా జీర్ణమౌనట్టివియు నగు పదార్థములనే తినవలెను. రాత్రిపూట భోజనము చాలా తేలికగా నుండవలెను పాలు, వెన్న, నెయ్యి, గ్రుడ్లు, పండ్లు, పప్పుపదార్థాలు, గోధుమరొట్టె మొదలగు పదార్థములు మనము తిను భోజనములో తప్పక కలిసియుండవలెను.

ఇందులో చెప్పబడిన ఆసనములన్నియు స్త్రీలుగూడా ఆచరింపవచ్చును అందువలన స్త్రీలకు గల్గు సర్వవ్యాధులు నివారణయౌటయే గాక, సుఖప్రసవమును, ఆరోగ్యవంతులగు బిడ్డలను గాంచెదరు.

విద్యార్థి యువకులకు విజ్ఞప్తి


విద్యార్థి యువకులలో నేడు నూటికి 90 మంది ముష్టిమైథునము, వ్యభిచారము మొదలగు చెడు అలవాట్లకు లోనై తాము నిర్వీర్యులగుటయేగాక మన జాతిని సైతము నిర్వీర్యము జేయుచున్నారు. దేశపునర్నిర్మాణమునకని పెద్ద పెద్ద ప్రణాళికలు తలపెట్టు ప్రభుత్వము మన జాతికంతకు మూలకందములగు యువకుల శారీరక మానసిక పతనమును గూర్చి తలచనైనా లేకున్నది. మరి యీ ప్రణాళికలు ఎవరి నుద్ధరించనో తెలియదు. జాతీయోద్యమ నాయకులు సైతము ఈ విషయములో ఏమాత్రము శ్రద్ధ కనబరచుటలేదంటే ఆశ్చర్యము కల్గించక మానదు. విద్యార్థి యువకులకు నా విజ్ఞప్తి యేమంటే మీరింతవరకు తెలిసిగాని తెలియకగాని, చేసిన చేయుచున్న దురభ్యాసములనువెంటనేమానివేయండి. ముఖ్యంగా ముష్టిమైథునము దురభ్యాసము గల విద్యార్థులు గాని యువకులు గాని దీని చెడుగులను గురించి చేయబడుచున్న ప్రచారమును గాంచి మిక్కిలి భయపడి క్రుంగిక్రుశించి మీ జీవితములనే సర్వనాశనం చేసుకోకండి. ఆ చెడుగులను కేవలం మందులతోనే తొలగించుకొన నెంచుట అవివేక మనుట కేమి సందేహం లేదు ఇందులకు ఒక్క ఆసనములే సమర్థములైనవి, కావున విద్యార్థి యువకులు వెంటనే యింతవరకు మీ రొన

(మిగతా 12వ పేజీలో)

ఆంధ్ర యువజనోద్యమ చరిత్రలో ఆంధ్ర యువజన

(మా విలేఖరి)

ప్రపంచమంతా ప్రజాతంత్ర నిర్మాణంకోసం, ఆయా దేశాల ప్రజలు పునర్నిర్మాణంతో, ముందుకు పోతున్నారు. యువతీ, యువకు లందులో ప్రముఖపాత్ర వహించుతున్నారు. ఆగస్టు 15 తరువాత నూతన పరిస్థితులలో భారత ప్రజలపై ఛిన్నాభిన్నమైన దేశాన్ని మతకలహాల బారినుండి రక్షించాల్సిన బాధ్యత పడింది. ఆంధ్రయువకు లీ కార్యక్రమంలో అగ్రగాములుగా నిలువ నడుంకట్టారు. ఈ ఆశయ ఫలితమే "రాష్ట్ర యువజన ఫెడరేషన్ మహాసభ" జరపాలన్న దీక్ష దీని పర్యవసానమే యీ నెల 17, 18 19 తేదీలలో పెదవడ్లపూడిలో జరిగిన యువజనమహాసభ.



మహాసభకు పడవలపై వచ్చిన జూపూడి యువజనసంఘ ప్రతినిధులలో కొందరు

ఫొటో—యం. వి. రాఘవయ్య.

పెదవడ్లపూడి మరొక ప్రేగ్ కావాలన్న మహాసభా నినాదం మూలమూలలా మారు మ్రోగింది. ఆంధ్ర యువకులందుకున్నారు. యౌవనోత్సాహంతో నడుం గట్టారు. ఒక్క పెదవడ్లపూడిలోనే 12 దళాలు పని చేశాయి. ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. పార్టీ విభేదాలు లేకుండా ప్రజానీకమంతా ధనమో, తృణమో అభిమానంతో అందజేశారు. రెండు యువకదళాలు రైళ్ళలోనే రు.500 లు వసూలు చేశారు. మొత్తం ఆ ఒక్క ఏరియాలోనే రు 1600 లు విరాళాలు వసూలయ్యాయి.

6 మణుగుల చింతపండు, 13 బస్తాల బియ్యం యింకా ఇతర వస్తువులు ఎన్నో వచ్చాయి. ఇవిగాక వివిధ తాలూకాలు, జిల్లాలనుండికూడా విరాళాలు, కూరగాయలు, పచ్చళ్ల మొదలైనవి మహాసభకు వచ్చాయి. మొత్తం మహాసభకు రు 3000 లు విరాళం వసూలయిందంటే పెద్దలెంతగా సాయపడ్డారో స్పష్టమౌతుంది.

చిన్నల పండుగకు పెద్దల సహకారం

మహాసభ అంటే యువకులకు ఒక పర్వదినం. తమ బిడ్డలు పండుగ చేసుకొంటూంటే చేయూత నివ్వాలని తండ్రులు ఉబలాటపడ్డారు. పెండాల్ నిర్మాణంనుండి ప్రతినిధుల భోజనాల వరకు అన్ని పనులూ గ్రామ రైతులే అమర్చిపెట్టారు. రోజూ 60 మంది రైతులు అతిథి సత్కారానికి పూనుకున్నారు. 20 మంది మహిళలు వంటకాలు సమకూర్చారు. గ్రామ యువకులంతా రేబవలనక పనిచేశారు. అందరిలోనూ ఒకేఒక భావం: "మహాసభను జయప్రదం చేయాలి; మన గ్రామ గౌరవం కాపాడాలి!" అన్నంతపనీ చేశారు. అద్వితీయంగా జరిగింది మహాసభ.

ప్రతినిధుల మహాసభ

17 వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమయింది. ఉదయాన్నుండే రైళ్ళన్నీ నినాదాలతో ప్రతిధ్వనించాయి. ఒక్కొక్క రైలుదిగి ఒక్కొక్క వూరేగింపు వస్తూంటే, ప్రక్కనున్న వాళ్ళంతా పరికించి పరవశులయ్యారు. ప్రతినిధులలో ధనిక కుటుంబాల బిడ్డలనుండి నిరుపేద వ్యవసాయకూలీ బిడ్డల వరకు — అన్ని వర్గాలవారూవున్నారు. 6 గురు ముస్లింలు, 4 గురు మహిళలు, 20 మంది వ్యవసాయ కూలీలున్నారు. ప్రతినిధుల నాహ్వానించుతూ కామ్రేడ్ వై. రామశేషారావు "ఎన్నాళ్ళనుండో ఉవ్విళ్ళూరుతున్న యీమహాసభయీనాటికి జరుగుతోంది. రాష్ట్రవ్యాపితఉద్యమానికి చక్కని స్వరూపమిచ్చి, పునర్నిర్మాణంతో ఆంధ్రదేశాన్ని సర్వసౌఖ్యాలతో తుల తూగేలా చేసేందుకు నడుం బిగించుదాం" అంటూ ఉద్బోధించారు.

మొట్టమొదట యువజనోద్యమంలో పని చేస్తూ మరణించిన యువక మృతవీరులు — సుంకర చిత్తరంజన్‌దాస్, కామినేని కృష్ణారావు, అనంత వెంకటేశ్వరరావు, కొల్లిపర భీమేశ్వరరావు, సనకా సుబ్బారావు, నివ గురవయ్యలకు జోహారు అర్పించారు. స్వాతంత్ర్య కార్మిక, కర్షక పోరాటాలలో అసువులర్పించిన అమరజీవులకు అంజలు లర్పించారు. కవికోకిల దువ్వూరి, ప్రఖ్యాత నటుడు సైగల్, వినాయక్‌ల మరణానికి సానుభూతి తెలియజేశారు.

అధ్యక్షునికి అఖండ స్వాగతము

600 మంది ప్రతినిధులు సభాధ్యక్షుడు చంద్ర రాజేశ్వరరావుగారికి అఖండ స్వాగత

మరుపురాని మహోజ్జ్వల ఘట్టం

ఫెడరేషన్ మహాసభ సమీక్ష

మిచ్చేందుకు రైల్వేస్టేషనుకు వూరేగింపుగా వెళ్ళారు. అఖండస్వాగత మిచ్చి వూరేగింపుతో, నినాదాలతో సభాప్రదేశానికి వచ్చారు. పెండాల్‌లో ప్రత్యేకమైన వేదిక; వెనుక యువక, జాతీయపతాకాలు. అటూ యిటూ ఆంధ్రలో యువజనోద్యమ స్థాపకులు రాజేశ్వరరావుగారి చిత్రం, ప్రపంచ యువజన సమాఖ్య బానర్ అలంకరించబడ్డాయి.

వేదికపై అధ్యక్షులు, నరసయ్య, రామకృష్ణరావు, దాస్ మొదలైన విద్యార్థి, యువజన నాయకులు ఆసీనులయ్యారు.

యువజనోద్యమ ప్రారంభం నుండి మహాసభ వరకు గల ఉద్యమ సమీక్ష విస్తృతంగా కామ్రేడ్ దాసు—


"అజ్ఞానంలో, అమాయకత్వంలో అణగివున్న ఆంధ్ర యువకులలో జాగృతి కల్గించి ఉత్తమ ఆంధ్రపౌరులుగా, స్వాతంత్ర్యయోధులుగా తయారుచేయడమే మన ఉద్యమ పరమావధి. సంఘ యాజమాన్యాన కొన్నిచోట్ల వయోజన విద్యాప్రచారం, ఆటల పోటీలు, రాత్రి పాఠశాలలద్వారా యువకలోకంలో చైతన్యం కల్గించాం." అంటూ సంఘకృషిని వివరించారు.

ఈ నాటి నూతన పరిస్థితులను వివరించి "ఆహార క్షామంతో అలమటించే ఆంధ్రదేశాన్ని సుభిక్షంగా చేసేందుకు, పునర్నిర్మాణ కార్యక్రమం జయప్రదం చేసేందుకు, ఆంధ్ర యువకులం నడుంబిగించాలి. ఇందుకు ఐక్య యువజనోద్యమం ఎంతేని అవసరం. అందుకు మీరందరూ కృషిచేస్తారని ఆశించుతానంటూ ముగించారు.

క్రాంతి స్థాపనలో ఆంధ్ర యువకులు అగ్రగాములుగా వుండాలి.

తరువాత సభాధ్యక్షులు చంద్ర రాజేశ్వరరావు గారు ఉపన్యసించుతూ 600 మంది ప్రతినిధులనిలా ఉద్బోధించారు.

"ఎన్నాళ్ళ నుండో ఏవగించుకుంటున్న ఇంగ్లీషు సామ్రాజ్యవాద పరిపాలన ఆగస్టు 15తో అంతమైంది. కాని దాని ఛాయలు మాత్రం యింకా మిగిలేవున్నాయి వాళ్ళకుట్రల ఫలితంగా యీనాడు దేశమంతా మతకలహాల మారణ హోమంలో భస్మీపటల మౌతున్నది. వీటి ప్రభావం ఆంధ్రలో సైతం ప్రతిబింబించుతోంది. ఆంధ్ర యువకులు యీ ప్రమాదాన్ని



15 వేలమంది హాజరయిన బహిరంగ సమావేశంలోని ప్రజా సమూహ దృశ్యం. ఫోటో—యం. వి. రాఘవయ్య.

శాంతిస్థాపనలో ఆంధ్రయువకులు అగ్రగాములుగా వుండాలి!

గుర్తించి, శాంతిస్థాపనలో అగ్రగాములుగా నిలవాలి"

తరువాత తీర్మానాలు చర్చకు వచ్చాయి. వరుసగా రెండురోజులు కొనసాగాయి. వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు వుత్సాహంతో. ప్రధాన రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన కామ్రేడ్ నరసయ్య, చక్కని వివరణతో, విషయాలతో ప్రతినిధుల నుత్సాహపరిచారు. తీర్మానాల ప్రతిపాదన, సవరణలు, వాదోపవాదాలు గమనించుతూంటే భవిష్యత్ భారత నిర్మాణానికి, ప్రజాతంత్ర స్థాపనకు యువక లోకం ఎంత ఆసక్తి చూపెట్టుతున్నదీ, ఎంతటి దీక్ష వహించుతున్నదీ ద్యోతకమైంది. ముఖ్యంగా కాసరనేని ప్రవేశపెట్టిన రాజ్యాంగ సభా తీర్మానం, ప్రత్యగాత్మ ప్రవేశపెట్టిన "నిబంధనావళి" తీర్మానం విషయంలో యీ విషయాలు స్పష్టమైనాయి. దేశాన్నెదుర్కొన్న ప్రబల సమస్యలు ఆంధ్ర యువకుల నెలా కదిల్చిందీ కనపడిందీ చర్చలలో.

తీర్మానాలు

శాంతిస్థాపనలోనూ, పునర్నిర్మాణ కార్యక్రమంలో అండగా ఉంటామని నెహ్రూ ప్రభుత్వాన్ని అభినందించుతూనూ—

తమ తమ స్వాతంత్ర్యాలకోసం ఫాసిస్టులతో వీరోచితంగా పోరాడుతూన్న స్పెయిను' ఇండొనేషియా, వీట్‌నామ్, గ్రీసు, చైనా' మొదలయినదేశాల యువకులనభినందించుతూ ఆంధ్రయువకుల సహకారం, అండవుందని తెలియజేస్తూనూ—

జమీందారీ, ఇనాందారీ విధానాలను పూర్తిగా రద్దుచేయాలని కోరుతూ—

భారత రాజ్యాంగచట్టంలో ప్రజాస్వామ్య సూత్రాల జేర్చవలెనని కోరుతూ—

వైజ్ఞానిక ప్రదర్శనలపై నిషేధాలను తొలగించాలనీ,—

ఆర్. యస్. యస్. విషప్రచారాన్ని గర్హించుతూ యువకులంతా దీనినుండి బయటపడి జాతీయ ప్రభుత్వాన్ని బలపర్చాలని — మొదలయిన తీర్మానాలు చేశారు.

తరువాత ఆంధ్రయువజన ఫెడరేషను "ప్రపంచ యువజనసమాఖ్య"కు అను బంధించాలని తీర్మానించారు. ఫెడరేషన్‌కు ఒక నిబంధనావళిని ఆమోదించారు.



శ్రీ బద్దం ఎల్లారెడ్డిగారు
మహాసభ ప్రారంభకులు

శ్రీ యస్. వి. నరసయ్య ప్రారంభం నుండి "నవయుగ" మీద నేటివరకూ రిపోర్టు యిస్తూ,పత్రిక అభివృద్ధికి ప్రతి యువకుడూ కృషిచేయాలని కోరారు.

తరువాత ఎన్నికలు జరిగాయి. శ్రీ యస్. వి. నరసయ్యగారిని అధ్యక్షులుగానూ, మల్లవరపు రామకృష్ణారావు, పంజం ప్రభాకరరెడ్డి గారలను ఉపాధ్యక్షులుగను, వి. వి. దాసు గారిని ప్రధాన కార్యదర్శిగను, యం. వి. సుబ్బారావు, కొల్లి ప్రత్యగాత్మగారలను సహాయ కార్యదర్శులుగను, యంపరాల నాగేశ్వరరావుగారిని కోశాధికారిగను, మరి 14 మందితో కార్యవర్గమును ఎన్నుకొన్నారు. 90 మందితో, వివిధ జిల్లాల ప్రతినిధులతో జనరల్ కౌన్సిల్‌ను ఎన్నుకున్నారు. "నవయుగ" సంపాదకవర్గానికి నరసయ్య, రామకృష్ణారావు, ప్రత్యగాత్మగారలను ఎన్నుకున్నారు.

అధ్యక్షులు సమావేశ నిర్ణయాలను సమీక్షచేస్తూ "మీ చర్చలు, తీర్మానాలు నన్నెంతో సంతోషపరచాయి. ఒక సునిశిత కార్యక్రమం తీసుకున్నారు. ఆంధ్ర యువజనోద్యమానికి ఉజ్వల భవిష్యత్తు వున్నదని రుజువుచేశారు. గ్రామగ్రామాన మహాసభ యిచ్చిన పిలుపు ప్రతిధ్వనించాలి. అనతికాలములో ఐక్య యువజనోద్యమం సాధించుకుంటారనీ. పునర్నిర్మాణంలో పూర్తి సహకారము యిచ్చి, దేశసౌభాగ్యానికి తోడుపడతారని ఆశించుతున్నాను" అంటూ ఉద్బోధించారు. జయ జయ ధ్వానాలతో ప్రతినిధుల సభ ముగిసింది.

2000 ంతో పూరేగింపు

సాయంత్రం 4 గం.లకు బ్రహ్మాండమయిన వూరేగింపు ముందు బ్యాండువాయిద్యాలు, ప్రజారక్షణ దళవలంటీర్లు 2000 మంది యువకులు బారులుతీరి నడుస్తుంటే ఆబాలగోపాలం ఆనందంతో తిలకించారు. కూడలి ప్రదేశాలలో గుంపులు గుంపులుగా నిలబడి చూచారు. తమ బిడ్డలంత గొప్పగా మహాసభ జరుపుకుంటారని వారూహించలేదు. అందరూ ఆనందంతో ఆశీర్వదించారు. వీధులన్నీ తిరిగి 6 గం.లకు స్టేషన్ వద్దనున్న మహాసభా మైదానంచేరారు.

మహాసభాదృశ్యాలు
15 వేల ప్రజా ప్రదర్శన

మైదానమంతా కిటకిటలాడి పోయింది. ఇసుక వేసినా రాలని జనం దయాస్ ఎక్కి చూస్తే ఒక మానవ సముద్రంలా వున్నారు. మహిళలే 2000 వేల వరకూ వచ్చారు. ప్రత్యేకంగా నిర్మించిన వేదికపై అధ్యక్షులు రాజేశ్వరరావుగారు, హైదరాబాద్ ప్రజానాయకులు బద్దం ఎల్లారెడ్డి, రాజబహదూర్ గౌడు, రఫీ అహమ్మద్‌గారలు, సుప్రసిద్ధాంధ్ర నాయకులు శ్రీ వావిలాల గారు ఆసీనులయ్యారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ రామశేషారావు గారి స్వాగత వచనం అయిన పిదప హైదరాబాద్ ట్రేడుయూనియన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీ రాజబహద్దర్‌గౌడ్ యువక పతాకాన్ని ఎగురవేశారు. తరువాత తెలంగాణా పోరాటాన్ని బలపరచి, ముక్కోటి ఆంధ్రుల విశాలాంధ్రను నిర్మించాలని ఎల్లారెడ్డి, రఫీ అహమ్మద్, స్వరాజ్యం, వావిలాల గారలు ఉపన్యసించారు. అధ్యక్షులు ప్రస్తుత

(మిగతా 10 వ పేజీలో)

కాలధర్మం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

వుడుకూడా కాలాన్ని కనిపెట్టి ఉన్నాడు కాలధర్మం గుర్తించలేని మానవుడు పైకిరాలేడు, కాలనిర్ణయానికి విరుద్ధంగా వెళ్ళటానికి ప్రయత్నించే మానవుడు అవమానం పాలవుతాడు.

కాలధర్మమంటే ఇంగ్లీషులో హిస్టారిక్ డిటర్మినిజమ్, అనీ, కాలనిర్ణయమంటే హిస్టారిక్ నెసెసిటీ అనీ అనుకోవచ్చు

మానవుడిమీద కాలానికి ప్రభావం ఉన్నట్టే మానవుడికి కూడా కాలంమీద కొంత ప్రభావం ఉంది. కాలధర్మాన్ని గుర్తించి మానవుడు ఆ ధర్మాన్ని మార్చేస్తాడు — కాలధర్మాన్ని తృణీకరించికాదు, తనకు అనుకూలంగా వినియోగ పరచుకుని.

కాలధర్మాన్ని వినియోగపరచుకోవటమంటే ఒక మహత్తరమైన దైవికశక్తిని - ఏ పేలుడు మందూ, అణుశక్తీ పోటీచెయ్యలేని అద్భుత శక్తిని - ఉపయోగపరచటమన్నమాట ఇది మన పక్షాన ఉన్నప్పుడు గోటితో కొండనెత్తవచ్చు, పదిమందిమి కలిసి పదివేలమందిని నిగ్రహించవచ్చు, అణువుబాంబులను పేలకుండా చేయవచ్చు, సత్యాగ్రహంతో స్వరాజ్యం సాధించవచ్చు

ఇంత మహత్తరశక్తిని కావాలన్నప్పుడే వినియోగించుకోవచ్చుననటానికి లేదు, దాన్ని వినియోగిస్తే ఎంతలాభం ఉందో, వినియోగించకపోతే దాని కన్నిరెట్లు అపాయం కూడా ఉంది, ఈ సంగతి స్పష్టంగా గ్రహించినవాడెవడూ కాలధర్మం గుర్తించటానికి ఉపేక్ష చేయడు.

అయితే జీవితంలో నిత్యమూ కనిపించే సంఘర్షణా, బాధా, నష్టమూ చూస్తే కాలధర్మం తెలిసినవారు ప్రపంచంలో ఎంతమంది ఉన్నారని సందేహం కలుగుతుంది. జీవితంలో సంఘర్షణ ఉండరాదనికాదు, కాలధర్మంలో మార్పు కలిగినప్పుడల్లా సంఘర్షణ ఉంటూనే ఉంటుంది, కాని కాలనిర్ణయానికి అనుకూలంగా కొందరు ప్రతికూలంగా కొందరూ సంఘర్షణ పడ్డప్పుడా సంఘర్షణ త్వరలో తేలిపోతుంది, ఎక్కువ బాధా, నష్టమూ కలగదు

కాలనిర్ణయానికి విరుద్ధంగా పోరాడేవారు ఎప్పుడూ ఉంటారు, వారికి ధర్మం తెలియదనటానికి వీల్లేదు. కాని ఆ కాలధర్మం వారి స్వార్థాన్ని అపహరించే పరిస్థితిలో, వారు పోరాడి తీరుతారు, పెట్టుబడిదారీ నాగరికతను నిరోధించేటప్పుడు జమీందారీ వర్గంవారు ప్రజాస్వామ్యాన్ని నిగ్రహించేటప్పుడు పెట్టుబడిదారులూ పోరాడి తీరుతారు.

ఈ విధంగా కాలనిర్ణయాన్ని ఎదిరించి పోరేవారిని కాలధర్మం తెలుసుకొని మనం సులభంగా గుర్తించవచ్చు ఎందుకంటే వారు తమ విజయంకోసం కాలధర్మాన్ని ఆశ్రయించుకున్న వినాదాలుకొన్ని తప్పనిసరిగా వాడుతారు - అయితే వాటిని అక్రమంగా వాడతారు సక్రమంగా వాడితే అవి వారికీ ఉపకరించవు, సామ్రాజ్యవాదులు చిన్నరాజ్యాల హక్కుల్ని గురించి బల్లగుద్ది వాదించేటప్పుడూ. పెట్టుబడిదారీవర్గంవాళ్ళు ఆర్థికప్రణాళికలను గురించి చర్చించినప్పుడూ. రష్యా విరుద్ధ ప్రచారం సాగించటానికి మార్క్సు ఛాయాచిత్రాన్ని వినియోగపరచినప్పుడూ. విద్రోహులుకూడా కాలధర్మం గుర్తించగలరని మనం తెలుసుకుంటాం. కాలనిర్ణయం తమకు అనుకూలంగా ఉందని ప్రజలను మభ్యపెట్టటమే విద్రోహులకు కావలసింది,

ఇటువంటి ప్రయత్నాలు సఫలమవుతాయా? దురదృష్టవశాత్తూ అవుతాయి. ప్రపంచంలో అధికసంఖ్యాకులకు కాలజ్ఞానం లేనంతవరకూ కాలనిర్ణయానికి విరుద్ధంగా పోరాడేమూఢులూ, సరిఅయిన నిర్ణయానికి రాలేని కర్తవ్యతా విమూఢులూ అభివృద్ధి నిరోధకులూ ఉంటూనే ఉంటారు ప్రపంచంలో బాధా, నష్టమూ పెంపొందించేది ఈ తరగతి వారే. ఉదాహరణలు చాలా దొరుకుతాయి హిట్లరు మీద సకాలంలో యుద్ధం ప్రకటించలేకపోయిన బ్రిటిషు టోరీ ప్రభుత్వమూ, అమెరికాను ధిక్కరించటానికినాడు తటపటాయిస్తున్న లేబరు ప్రభుత్వమూ దీనికి నిదర్శనాలు

సచిత్ర కావశ్యకత అనబడే కాలనిర్ణ[illegible]

[illegible] దెప్పుడూ సందిగ్ధస్థితే. సందిగ్ధావస్థ ప్రభుత్వాలకేకలుగుతున్నప్పుడు ప్రజాసామాన్యానికి కలగటంలో ఆశ్చర్యం లేదు కాని జనసామాన్యానికి కాలతత్వం బోధపడటం చాలా కష్టం. దానికి తోడువారిని మభ్యపెట్టడానికి అనేక ప్రయత్నాలు జరుగుతాయి. అటువంటి పరిస్థితులలో కాలనిర్ణయం ప్రజలకు అర్థం కావటం ఎట్లా ?

సాంఘిక జీవిత తత్వమూ, ప్రపంచ జ్ఞానమూ కాల నిర్ణయాన్ని గుర్తించటానికి రెండు పెద్ద సాధనాలు ఇవికూడా కష్టపడితే గాని లభ్యమయేవికావు. ఈ రెంటికన్నా సూక్ష్మోపాయం ఒకటి ఉన్నది అదేమంటే జీవిత సంఘర్షణనుచూసి కాలనిర్ణయం తెలుసుకోవడం

జీవితంలో జరిగే సంఘర్షణను నిష్పాక్షికంగా చూస్తే అందులో కొన్ని విడ్డూరాలు కనిపిస్తాయి పిచ్చుకలమీద బ్రహ్మాస్త్రాలు వేయటమూ, సమస్యలకున్న పరిష్కారమార్గాలు హేయంగా పరిణమించటమూ, మొదలైన వాటిని బట్టి మనం కాల నిర్ణయం గుర్తించవచ్చు అమెరికాలోనూ- దక్షిణ ఆఫ్రికాలోనూ ప్రభుత్వాలు అధఃపతితులై ఉన్న నీగ్రోలమీదా, దేశీయులమీదా దారుణ హత్యాకాండలు జరపటం ఎందుకు జరుగుతుంది ? నిరాయుధులైన పాకీవాళ్ళమీదా కార్మికులమీదా పోలీసులు అత్యాచారాల నెందుకు చేయవలసి వస్తుంది ? హైద్రాబాదులో ఉన్న రాజకీయ శక్తులన్నీ రైతులమీద ఎందుకు కేంద్రీకరించవలసి వస్తుంది ? కమ్యూనిస్టులు తీసుకురాబోయే అరాచక పరిస్థితుల్ని ప్రతిఘటించటానికి ప్రజారక్షణ చట్టంలాంటి తుచ్ఛశాసనం ఎందుకు చెయ్యవలసి వస్తుంది ? అన్నిటికీ ఒకటే సమాధానం : పాలకవర్గానికి కాల నిర్ణయం ప్రతికూలంగా ఉండిగనక !


పిచ్చుక పక్షాన కాల నిర్ణయం ఉన్నప్పుడు బ్రహ్మాస్త్రమే వెయ్యవలసి వస్తుంది కాని మొదటనే చెప్పినట్టు మానవుడికి కాలనిర్ణయం గుర్తించే శక్తివుంటే బ్రహ్మాస్త్రంకూడాపారదు. మానవుడికి కాలజ్ఞానంలేకపోతే పదిమంది లాభాలకోసం లక్షమందిపోరాడటం జరుగుతుంది.

కొండపైకి రైళ్ళెలా వెళ్తాయి?

రచన, ఫొటోలు : కొండేపూడి శ్రీనివాసరావు


ఈ బొమ్మలో మాదిరి యినుపదారి నెక్కడయినా చూచారా? చాలా వింతగా ఉండదూ? ఎత్తునకు పోయే రైలు మార్గాలిలాగనే ఉంటాయి. ఈ బొమ్మను జాగ్రత్తగా పరిశీలించండి. ఇది నీలగిరి కొండలపై 7228½ అడుగుల ఎత్తున్న ఉదకమండలానికి పోయే రైలుమార్గం.

ఇప్పుడు ఈ కొండలపైకిపోయే రైలు దారులు ఆ విధంగా ఉండవలసిన ఆవశ్యకతను ఆలోచిద్దాం. దీనిని తెలుసుకోవాలంటే



కొండపైకెక్కే రైలు పట్టాలు.

ఆ మాదిరిగా లేకపోతే వచ్చే నష్టాలను కష్టాలను తెలుసుకొంటే అట్టి మార్గంయొక్క అవసరం సులభంగా గ్రాహ్యమవుతుంది. మామూలు రైలుదారిలాగ రెండు యినుప బద్దీలే ఉన్నాయనుకొందాం. మామూలుగా యింజను ముందుండి పెట్టెలను లాగుకొంటూ కొండ ఎక్కుతోందనుకొందాం. ప్రమాదవశాన ఆ యింజనుకు రైలు పెట్టెలకు ఉన్న లింకుగాని, పెట్టెకు పెట్టెకు ఉన్న లింకుగాని ఊడిపోతే ఆ పెట్టెలు ఎత్తునుండి జరజరా క్రిందికి దొర్లుకుంటూ రావలసిందే! క్రిందపడి పిప్పి కావలసిందే! అందులోని జనమంతా ప్రమాదాలకు లోనుగావలసిందేగా? అందుకనే యింజను రైలుపెట్టెలన్నింటికంటె ఆఖరనుండి, వెనుకనుండే గెంటుతుంది. ఈలాగ ఉండడంవల్ల రెండులాభాలు. ఒకటి పెట్టెకు పెట్టెకు ఉన్న లింకు ఊడిపోయినా ప్రమాదాలు సంభవించవు. ఎందుచేతనంటే యింజనే ఆఖరనుండి గెంటుతోంది కాబట్టి. రెండు, యింజను వెనుకనుండి గెంటుటవల్ల ఎక్కువ శక్తితో పైకి నెట్టగలదు. ఇది ముఖ్యంగా కొండ ఎత్తునకు పోయేటప్పుడు బాగా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే వెంటనే మీకొక సందేహం వస్తుంది. బాగానే ఉంది, యింజను పెట్టెలన్నింటికంటె వెనకనుండి



కొండపైకెక్కే రైలు.

గెంటుతుంది కదా, యిప్పుడు యింజనుకు పెట్టెలకు ఉండే లింకుపోతే ఎల్లాగా అని. అందుకనే ఆ రెండు యినప బద్దీలకు మధ్య పళ్ళుపళ్ళుగాగల మరొక బద్దీ వేయబడింది. ఆ రైలు ఇంజనుకూడ మామూలు రైలు యింజన్ల మాదిరిగా ఉండదు. సైజులో చిన్నది, ముందుండే రెండుచక్రాల మధ్య పళ్ళు పళ్ళుగల మరొక చక్రంకూడా ఇంజనుకు ఉంటుంది. ఇంజను చక్రం పళ్ళు, మధ్యనున్న మూడవ రైలుబద్దీ పళ్ళు ఏలాగ అమర్చబడుతాయంటే, రైలు కొండపైకి పోయేటప్పుడు ఆ పళ్లు అడ్డుపడకుండాను, రైలు వెనక్కు జారిపోతున్నప్పుడు మాత్రమే, అవి అంటే బద్దీపళ్లు, చక్రంపళ్ళు తగులుకొని యింజను వెనక్కు జారిపోకుండా గట్టిపట్టు పట్టేటట్లు అమర్చబడతాయి. రెండవ ఫొటోలో యింజను వెనుకనుండి గెంటుతూన్న దృశ్యం గోచరమవుతుంది. రైలు కొండ దిగేటప్పుడు మాత్రం రైలు, పెట్టెలకు ముందుగానే ఉండి లాగుతుంది.

అంత ఎత్తుకి బస్సులుకూడ అంచెలు అంచెలుగా సున్నాలు చుట్టుతూ పైకిపోతాయి. ఆ రోడ్లు అత్యంత రమణీయంగా ఉంటాయి. లోయలు, మైదానాలూ, ముక్కోణాకారపు వృక్షాలూ సింకోనాచెట్లు, టేకు, వెదురు అడవులు. యూకలిప్టసు చెట్లు, టీతోటలు వివిధ పుష్పజాతుల్ని చూడడానికి నేత్రోత్సవంగా ఉంటాయి.

(7వ పేజీ తరువాయి)

రించిన చెడు నడతలను పూర్తిగా విర్చివేయుడు నేడే ఆసనములకు శరణుజొచ్చుడు ఒక సంవత్సర కాలములోనే పరిపూర్ణ బలారోగ్యములు పొందగలరు. ఇందు ఏమాత్రము సందేహములేదు. మాయదారి ప్రకటనలను నమ్మి మోసపోకుడు. అమందులకు ఖర్చుపెట్టు ధనమును మిగిల్చుకొని ఆసనములు చేయుచూ పైన పేర్కొనబడిన ఆహారమునకై ఖర్చుపెట్టిన ఎంతయో ప్రయోజనకరము. ఇకనైనా కళ్ళుదెఱచి మిమ్ములను మీరుద్ధరించుకొని, మీజాతినుద్ధరించుటకు, నేటి నవయుగోదయములో మీ పాత్రను నిర్వహించుటకు కదలిరండు.

'నవయుగ' చందా వివరాలు

సంవత్సర చందా	3—0—0
½ సంవత్సర చందా	1—8—0
విడి ప్రతి	0—4—0

స్వతంత్రభారత్ : స్వతంత్రభారత్

పదండి ! పదండి !!
స్వతంత్ర భారత్, స్వతంత్ర భారత్
స్వతంత్ర భారత్ పిలిచిందీ
స్వతంత్ర భేరీ మ్రోగిందీ
కత్తులు దూసీ - కదందొక్కుతూ
కదన భూమికే కదలండీ
శత్రువులను తెగటార్చండీ
పదండి ముందుకు పదండి నెట్టుకు
పదండి చరచర పదండి పదండి
ఎత్తుపల్లముల ముదిలోకానికి
అంతిమ కర్మలు జేయంగా
ఒడుదుడుకులు లేనట్టీ
ఏకబారు నవలోకం
మదిలోభం తొలగించే
పదునుగల్ల యువలోకం
చరచర సృష్టించేందుకు
మాతాపిత విద్రోహం
శత్రు సమూహ నశేషం
ఆత్మ హత్యాకర ప్రతి ఫలితం
తుది సమరం కాలేదని ముదిలోకంపోలేదని
నవలోకం వస్తోందని
పదంపాడుతూ - కదందొక్కుతూ
పదండి ముందుకు - పదండి నెట్టుకు
పదండి చరచర - పదండి పదండి
ముదిలోకపు అధినేతలు
పదపడిగా మొదలారుతు
తమదమ అవసానకాలాల
తుది ఘడియల్లో
కొనవూపిరి పెనవేస్తూ
కాలానికి యెదురీదుతు
అంధకార బంధురమగు
శిధిలమైన ముదిలోకపు
ఛాయల పునః ప్రతిష్ఠించగ
నవనవలాడే నవలోకపు
మొగ్గను మొగిలో తుంచేందుకు
పగటికలలు కంటూండే
విగత జీవులగు
ముదిలోకపు అధినేతల
తెగటార్చగ తెగటార్చగ
రారందోయ్ - రారండీ - రారండీ
రారండీయని

—పొన్నా కోటేశ్వరరావు

విద్యార్థి లేరా

[బాణీ—జాగేలనోయ్ రైతుబాబయ్య]

జాగేలనోయ్ విద్యార్థి వీరుడా
పదుగురినొకటికి జేర్చి పరుగునరావోయి ॥జా॥
నీ సంఘశక్తిని సంఘటిత పరచియు
బానిస విద్యను వేగమె బాపవదేల ॥జా॥
లేరా ...... లేచి రమ్మురా
చాటునుండియు - యీ నాటకమాడే
క్రూర నిరంకుశత్వమును కూలద్రోయగ ॥జా॥

[బాణీ:—భారత వీరకుమార]

పరుగునరార విద్యార్థీ పదుగురి నొకటిగజేర్చి
స్వాతంత్ర్యాశయసిద్ధికి నిపుడె చెయిచెయి
కలుపగలేర ॥జా॥
స్వాతంత్ర్యము శాంత్యభ్యుదయపతాకంబుచేత
నిడిచనరా—
జయభేరిన్ మ్రోగించుమురా
జై జై జై యనరా
జై జై జై యనరా
జై జై జై యనరా

[బాణీ,—వీరకుమార]

లేర విద్యార్థీ - రార విద్యార్థీ
సమయము నీదేనోయ్ - సాగిరమ్ము వేగ-
సాగిరావదేల ॥లే॥
బానిస విద్యను బాపియు యిలపై
వృత్తివిద్య నిలవేగ నిర్మింపగ ॥లే॥
వివిధ ప్రాంతముల విప్లవభావములు
చూడర, విజయము నీదే లేర ॥లే॥
ఈ పదపోతను నాశము చేయగ
యింగిత మెరిగియు ముందంజేయర ॥లే॥
సంఘశక్తితో సాటిశక్తి యిల
లేదని గళమెత్తి పాటపాడగ ॥లే॥

—— కారే రాఘవులు

★

యువశక్తి

యువజనులు ముందుకురావాలోయ్
యువశక్తి పెంపొందజేయాలోయ్ ॥యు॥
పరప్రభుత్వపు పీడ పారదోలి మనము
స్వారాజ్య ఫలమును సాధించినామింక
దేశరక్షణ దీక్ష బూనాలోయ్
దేశసేవకు నడుముకట్టాలోయ్ ॥యు॥
ఆహారకరువింక నధికమౌతున్నది
తిండిదొంగలు ప్రజల దోచివేస్తున్నారు
బ్లాకుమార్కెటుదార్ల బట్టాలోయ్
ప్రజకు ధాన్యంబంద జేయాలోయ్ ॥యు॥
మన దేశపరిశ్రమల్ వెనుకబడియున్నాయి
మన ప్రజ విద్యలో మరి వెనుకబడ్డారు
రాత్రి బడులలో చదువు చెప్పాలోయ్
వ్రాయను చదువను నేర్పాలోయ్ ॥యు॥
మన ప్రజల విజ్ఞాన మభివృద్ధి పరచుటకు
మన కళానైపుణ్య మధికంబు చేయుటకు
యువకవులు ముందునకు రావాలోయ్
యువజనులను తేజపరచాలోయ్ ॥యు॥
ఆటపాటలు చదువు నన్నివిద్యలనేర్పి
ఆరోగ్యముగ మనము హాయిగాజీవింప
యువజనసంఘాల్లో జేరాలోయ్
నవ యువజగతి నిర్మించాలోయ్ ॥యు॥
నేటి యువకులే రేపు నాయకులు దేశాన
సాటిదేశ యువక చెలిమి పెంపొందించి
శాంతి స్వాతంత్ర్యాల గోరాలోయ్
అభ్యుదయమార్గాన పోవాలోయ్ ॥యు॥
మనదేశమును చీల్చి మనలో తగవులుపెట్టి
మధ్య సంస్థానాల్ని మన ప్రజలపై దోలె
నక్కజిత్తుల నెగురగొట్టాలోయ్
* నైక్యశాంతి నెలకొల్పాలోయ్ ॥ ॥యు॥

—అడ్డాద కోటేశ్వరరావు

★

రేడియో ప్రోగ్రాం

★

ప్రజానాట్యమండలి (రాష్ట్రదళం)
నవంబరు 9 సా॥ గం. 6—30 లకు

కన్యక

[జముకుల కథ]

కధన:— మిక్కిలినేని

వంతలు :— } మాచినేని
} వుమామహేశ్వర్

ఆంధ్ర ఐక్యతకు రాయలసీమ

సర్కారు, రాయలసీమ విభే

యస్. వి. సరసయ్య

భారతదేశ స్వాతంత్ర్య సిద్ధితో ఆంధ్ర రాష్ట్ర సమస్య ప్రాధాన్యత వహించింది. ఇంత వరకు వివిధ జాతుల ప్రజలను అస్వాభావికంగా ఒకే రాష్ట్రంలో అట్టిపెట్టి యీ వివిధ జాతుల ప్రజలమధ్య చీలికలేర్పరచి తమ దోపిడిని కొనసాగించిన బ్రిటిష్ సామ్రాజ్యవాద పరిపాలన అంతమగుటతో యిక నాంధ్రరాష్ట్ర సిద్ధికి ఎట్టి అడ్డంకులుండవని ఆంధ్రప్రజ లాశించారు అగస్టు 15 తో ప్రత్యేకాంధ్రరాష్ట్రసిద్ధికి ఎన్ని అవకాశా లేర్పడ్డాయో ఆంధ్రప్రజలు బాధ్యతతో పరిష్కరించవలసిన అన్ని నూతన సమస్యలుకూడా ఉద్భవించాయి.

సామ్రాజ్యవాదుల కుట్ర

సామ్రాజ్యవాదులు, బానిసప్రజలు తమ దోపిడీవిధాన నిర్మూలనకు ఐక్యమవకుండా తమలో తాము కీచులాడుటకు వివిధ జాతుల ప్రజల అభివృద్ధిలో తీవ్ర వ్యత్యాసాన్ని పెంపొందించారు దీనిఫలితంగా ఒకే రాష్ట్రములో వుండే వివిధజాతుల ప్రజలలోను తమ అభివృద్ధికి అడ్డుతగిలేది అన్యరాష్ట్రంలో అభివృద్ధిచెందిన జాతియను భావము వ్యాపింపజేయవలయునని, తద్వారా తమ దోపిడీని కప్పిపుచ్చుకొనవలయునని వీరి ప్లాను. అట్లే నేటి మద్రాసు రాజధానిలోని కన్నడ, మళయాళీ, తమిళ, ఆంధ్ర ప్రజలలోకెల్ల అభివృద్ధియైన తమిళులపై యితర ప్రజల ద్వేషం కేంద్రీకృతమగునటు చేయగల్గారు అట్లే ఒకే రాష్ట్ర ప్రజలలోని ఐక్యతనుగూడ భగ్నపరచుటకు వివిధ ప్రాంత భాగాల మధ్య ఆర్థిక వైజ్ఞానికాభివృద్ధిలో తీవ్ర వ్యత్యాసాలను సామ్రాజ్యవాదులు తమ 200 సం॥ల పరిపాలనలో ఏర్పరచారు. సామ్రాజ్యవాదులు అనుసరించిన యీ పంథా ఫలితంగా నేటి ఆంధ్ర జిల్లాలలోని సర్కారు, రాయలసీమ జిల్లాల మధ్యనున్న ఆర్థిక, వైజ్ఞానిక వ్యత్యాసం. సర్కారు జిల్లాల్లో రాయలసీమ జిల్లాలకంటె వ్యవసాయ సదుపాయాలు విద్యాలయాలు హెచ్చు నిర్మించబడినాయి రాయలసీమ ప్రజలు సంవత్సరాలు తరబడి కరువు కాటకాలకు లోనవుతున్నా ప్రభుత్వం కరువు నివారణమాని, కోట్లు ఖర్చుపెట్టి రాళ్ళు పగుల గొట్టించిందిగాని రాయలసీమలో మరల కరువు రాకాసి తాండవించకుండా యుండునట్లు ఆ డబ్బు నుపయోగించి మైనరు, మేజరు యిరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించుటకు పూనుకోలేదు

రాయలసీమ సర్కారు జిల్లాల మధ్యనున్న యీ ఆర్థికవ్యత్యాసం ఫలితంగానే నేడు వివిధ డిపార్టుమెంటుల్లో సర్కారాంధ్రులు హెచ్చు మంది యున్నారు ఈ స్థితిలో ప్రత్యేకాంధ్ర రాష్ట్రమన్న వెనుకబడ్డ రాయలసీమ ప్రజలపై అంతకన్న అభివృద్ధి జెందిన సర్కారాంధ్రుల పరిపాలన మాత్రమే కాగలదని, రాయలసీమ ప్రజలకు సరియైన న్యాయం జరుగదనే భయం రాయలసీమ సోదరులనేకమందిలోనూ ముఖ్యముగా విద్యావంతుల్లోనూ వుంది.

రాయలసీమ రాష్ట్ర నినాదం

నేడు రాయలసీమ, సర్కారాంధ్రుల మధ్యనున్న వ్యత్యాసాలను నిర్మూలించుటకు రాయలసీమ సోదరులు తమ యభివృద్ధికి కొన్ని ప్రత్యేక సదుపాయాలు కోరటం న్యాయమే సర్కారువాసులు అందుకంగీకరించుట గూడ తమ కర్తవ్యం.

కాని కొంతమంది రాయలసీమనాయకులు తమ వ్యక్తి ప్రయోజనాలను, వర్గ ప్రయోజనాలనూ ఆంధ్రజాతి సౌభాగ్యమునకన్న యెక్కువగా ఎంచి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రనిర్మాణము మినహా రాయలసీమ ప్రజల యభివృద్ధికి వేరుమార్గం లేదను ప్రచారం ప్రారంభించారు సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థ ఫలితంగా నేడు ఏర్పడ్డ ఆర్థికస్థాయి విభేదాలను వీలుగా తీసికొని సర్కారాంధ్రులపై రాయలసీమ ప్రజలలో ద్వేషం రెచ్చగొట్టజూస్తున్నారు. ఈ వర్గ నాయకులే రాయలసీమ, సర్కార్ ప్రజలకు భాష ఒకటైనా వారివైజ్ఞానిక సాంప్రదాయాలు, అలవాట్లూ వేరని అందుచేత రాయలసీమ వాసులు ప్రత్యేకజాతియనే తప్పుడు సిద్ధాంతాలను గూడ లేవనెత్తారు.

ఈవాదనకు ఆర్. సూర్యనారాయణ మున్నగు మితవాదులూ, మూలా నరసింహస్వామి మున్నగు పెట్టుబడిదార్లూ నాయకులు. గమనించదగ్గ మరో విషయమేమంటే రాయలసీమ రాష్ట్రసిద్ధాంతానికి వెనుక రాయలసీమ పెట్టుబడిదార్లంతా ఐక్యమైయున్నారు సర్కారు రాయలసీమాంధ్రుల కలయికతో తమ దోపిడీ హెచ్చుకాలంసాగదని వీరికితెలుసు అందుచేత వెనుకబడియున్న రాయలసీమజిల్లాలు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడితే తమ దోపిడీ నిర్విఘ్నంగా సాగించవచ్చునని యీ పెట్టుబడిదార్ల కుతంత్రం.

సర్కారాంధ్రుల కర్తవ్యం

రాయలసీమజిల్లాల ప్రజల్లో సర్కారాంధ్రులంటే వున్న అనుమానాలను తొలగించటం సర్కారువాసుల కర్తవ్యం. కాని సర్కారు నాయకులుగూడ అనేకమంది రాయలసీమ ఎడ బాధ్యతారహితంగా ప్రవర్తించడం జరిగింది మొన్న నేజరిగినమద్రాసు రాజకీయమహాసభలో ఆంధ్ర కాంగ్రెసునాయకులైన రంగా, ప్రకాశం గార్ల ఉపన్యాసాలు ప్రవర్తన రాయలసీమ ప్రజలలోని అపోహలను మరింతదిట్టపర్చాయి. రాయలసీమరాష్ట్రం మినహా రాయలసీమ పురోభివృద్ధికి వేరు గత్యంతరం లేదనే వాదనకు బలంచేకూర్చాయి దీనికితోడు గుంటూరు మద్రాసు మున్నగు విద్యార్థి కేంద్రాలలోని విద్యార్థుల కీచులాటలుగూడ నేటి ఆంధ్రరాష్ట్ర ఆందోళనను విచ్ఛిన్నపరచుటకు తోడ్పడుతున్నాయి సర్కారువిద్యార్థిసోదరులు రాయలసీమ విద్యార్థులను అగౌరవపర్చటం చిన్నచూపుచూడటం జరుగుతూంది ఈ ప్రవర్తన భావిపౌరులయిన విద్యార్థులలో సర్కారు రాయలసీమద్వేషాన్ని మరింత హెచ్చుజేయుటకు తోడ్పడుతుంది.

నేటి వార్తలను బట్టి ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణమునకు కాంగ్రెసు నాయకులనుకూలమనీ మనలోని స్పర్ధలు ఎంత త్వరితంగా సర్దుకోగలిగితే అంత తొందరలో ఆంధ్రరాష్ట్ర నిర్మాణం జరుగగలదని తెలుస్తూంది. ఈ వార్తల గమనించే ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణమును విచ్ఛిన్న పర్చాలనే శక్తులుగూడ తమ ప్రయత్నాలు తీవ్రంగా సాగిస్తున్నాయ్. ఆంధ్రజాతి ఔన్నత్యాన్ని ఐక్యతనుగోరే ప్రతియాంధ్రుడూ నేటి యీ ప్రమాదాన్ని గుర్తించవలసి యుంది. ఆంధ్రులఐక్యతకు పూనుకోవలసియుంది. నేటి రాయలసీమ ప్రజల్లో

అభివృద్ధికి పూనుకోవాలి!

ధాలు ప్రజలకు నష్టం

సర్కారు వాసులపైనున్న అనుమానాలను తొలగించవలసియుంది. అందుకు రాయలసీమ జిల్లాలు,సర్కారు జిల్లాల విద్యా వ్యావసాయక స్థితికి వచ్చేవరకు రాయలసీమజిల్లాల అవసరాలకు ప్రాధాన్యత నివ్వవలసియుంది. ఈ నినాదాన్ని ఆంధ్రజాతీయ ఐక్యతను వాంఛించే ప్రతి యాంధ్రుడూ బలపర్చవలసియుంది

ఆంధ్ర ఐక్యతను నిర్మించండి.

ఈ పంథాను అనుసరించి ప్రభుత్వం తిరుపతిలో ఒక విద్యాలయాన్ని నిర్మించాలి. దేవస్థాన ధనాన్ని యిందుకు వెచ్చించాలి. అనంతపురం యింజనీరింగు కళాశాలను గిండీ నుండి వెంటనే అనంతపురం మార్చాలి, నేటి అనంతపురం కాలేజీలో ఆనర్సు కోర్సులను ప్రారంభించాలి,మదనపల్లిలో వైద్యకళాశాలను నిర్మించాలి,కడపజిల్లాలో ఫస్టుగ్రేడ్ కళాశాలను నిర్మించాలి రాయలసీమ జిల్లాల అభివృద్ధికి అవసరమగు వ్యవసాయకళాశాలను గూడ నిర్మించాలి,

ప్రభుత్వం రాయలసీమప్రజలను కరువుకాటకాలనుండి రక్షించుటకు అవసరమైన యిరిగేషన్ ప్రాజెక్టులను వెంటనే ప్రారంభించుటకు ప్లాన్లు తయారుచేయాలి.

ప్రభుత్వంచే యీ కార్యక్రమం అమలు జరుగునట్లు జేయగల్గినపుడే నేటి రాయలసీమ సర్కారులమధ్య వ్యత్యాసం తొలగించ సాధ్యమవుతుంది ఆంధ్రజాతి సంపూర్ణ ఐక్యతను విశాలాంధ్రద్వారాసాధించుటకునేటియిండియన్ యూనియన్‌లోని 1 కోటి 80 లక్షల ఆంధ్రులు కృషిసల్ప సాధ్యమవుతుంది

రాయలసీమ రాష్ట్ర నినాదాన్ని బలపర్చే సోదరుల కొరకమనవి మన ఆంధ్రజాతి బ్రిటిష్ పరిపాలనతో చిన్నాభిన్నమైంది. నైజాం నిరంకుశత్వం క్రింద 80 లక్షల ఆంధ్రులు నానాబాధలు పడుతున్నారు.

కొందరు ఒరిస్సాలో, మరికొందరు మైసూర్ సంస్థానంలో(కోలారు) మరికొందరు సంయుక్త రాష్ట్రాలలో (దాండా) చీలిపోయియున్నారు. దీని ఫలితంగా జాతి, విజ్ఞానం అభివృద్ధి పొందలేదు రోజురోజుకూ నీరసించిపోతోంది. ఈ చీలికలుచాలక రాయలసీమ సర్కార్ వాసులుగూడ చీలిపోయిన, యిక ఆంధ్రజాతి భవిష్యత్తేమిటి ?

ఈ రెంటి చీలికవస్తే ఆంధ్రజాతికి ముక్తి లేదు. రాయలసీమ రాష్ట్రం సూన్యం ప్రత్యేకాంధ్రరాష్ట్రం అంతకన్నా సూన్యం రాయలసీమ, సర్కార్లఐక్యతే ప్రత్యేక విశాలాంధ్రను నిర్మించగలదు. ప్రత్యేకాంధ్రరాష్ట్రం ద్వారానే మన మూడుకోట్ల ఆంధ్రజాతిని ఐక్యపరచి విశాలాంధ్రను సాధించగలం

ప్రతి యాంధ్రుడూ నేటి యీ పవిత్ర కర్తవ్య నిర్వహణకు శక్తికొలది కృషిసల్పుతారని ఆశిస్తాను.

—o:o—

సెప్టెంబరు నెల జమా ఖర్చులు

58- 6-0	నిరాళాలు		
124- 0-0	చందాదారులు		
627-11-6	ఏజన్సీలు		
137- 8-0	ప్రకటనల ద్వారా		
120- 0-0	బ్యాంకునుండి		
143- 2-0	క్రితం నెల నిల్వ		
57- 6-6	రాష్ట్ర విద్యార్థి సంఘం		
		ఆఫీసు ఖర్చు	32-11-9
		ప్రయాణము	33- 7-0
		తపాలా	120- 5-6
		బ్లాకులు	96- 7-0
		ప్రెస్సుకు	126- 0-9
		పేపరు	65- 0-0
		అలవెన్సులు	11-10-0
		అద్దె	54- 0-0
		గ్రంథాలయము	67- 6-3
		ఎస్టాబ్లిష్‌మెంటు	155- 0-0
		అప్పు తీర్చినది	364- 0-0
		అనామతు	78-12-0
1268- 2-0			1204-11-6

రు 63-6-6 నిల్వ

(10 వ పేజీ తరువాయి)

పరిస్థితులు, మతకలహాల ప్రమాదం, ప్రజల కర్తవ్యాన్ని గురించి వివరించి, "శాంతి స్థాపనకు ఆంధ్ర యువకుల కృషిని ఆంధ్ర ప్రజానీకం అన్నివిధాల బలపరచాలని" విజ్ఞప్తి చేశారు. తరువాత యస్ వి నరసయ్యగారు ప్రతినిధుల సమావేశ నిర్ణయాలను వివరించి ఆంధ్ర ఔన్నత్యమునకు అన్నివిధాలా పాటుబడతామని వాగ్దానం చేశారు ఆహ్వాన సంఘాధ్యక్షుని వందన సమర్పణతో మహాసభ ముగిసింది.

వైజ్ఞానిక ప్రదర్శనాలు

రాత్రి 11 గంటలకు వైజ్ఞానిక పోటీలు. 20 వేల ప్రజలు వచ్చారు. ప్రదర్శనలింకా ప్రారంభంగాకముందే పెద్దపెట్టున వర్షం గురిసింది. అయినా జనం చెదరలేదు కుంతమగ్గులవలె నిల్చున్నారు. వర్షం వెలిసాక పోటీలు ప్రారంభమయ్యాయి వివిధ జిల్లా దళాలు పాల్గొన్నాయి పోటీలలో గుంటూరు జిల్లాదళానికి ప్రదమ బహుమతి వచ్చింది రాత్రి 2-30 గంటలకు ముగిశాయి ప్రదర్శనాలు.

"మాభూమి" పై మమత

మొదట "మాభూమి" ఉచిత ప్రదనర్శనముంటుందని ప్రజలు ఆశించారు ఆ ఆశతోనే బురదలో అలాగే గంటల తరబడి కూర్చున్నారు. చివరకు ప్రదర్శన లేదనేసరికి (కాలాతీతమైనందున) వేలాది ప్రజలు ఆశాభంగం చెందారు "పాపిష్టివాన పొట్ట బెట్టుకుంది" "మా కళ్ళు పాపం జేసుకన్నాయి" అనుకుంటూ ప్రజలు వెళ్ళారు నిరాశతో నిందించిన ప్రజలుకూడా వున్నారు. ఆంధ్రప్రజల హృదయఫలకాలలో "మాభూమి" మహోన్నత స్థానం అలంకరించింది.

మహాసభాదృశ్యాలు. నిర్ణయాలు మనోవీధిలో యింకానాట్యమాడు తుండగా బస చేరుకున్నాను "యువజనఫెడరేషన్" జిందాబాద్,నినాదాలు దారిపొడగునా చెవులుగింగురుమనేట్లు ప్రతిధ్వనించుతూనే వున్నాయి.

ఒక్క మాటలో !

మొత్తంమహాసభను గురించిఒక్కమాటలో చెప్పాలంటే—

"ఆంధ్ర యువజనోద్యమ చరిత్రలో - మరపురాని మహోజ్వల ఘట్టం" పెదవడ్లపూడి మరొక ప్రేగ్‌కావాలన్న నినాదం అక్షరాలా ఆచరణలో నిజమయింది.

దినాదినాభివృద్ధిపొందే విద్యార్థుల ఐక్యత !

ఐక్య విద్యార్థి ఉద్యమం కావాలని యెన్నా ళ్ళనుండో ఆందోళన జరుగుతున్నది. అఖిల భారత విద్యార్థి కాంగ్రెసు కార్యవర్గం 1947 జూన్ సమావేశంలోనూ, అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ కార్యవర్గం జులై సమావేశంలోను ఐక్యవిద్యార్థి ఉద్యమాన్ని నిర్మించాలని తీర్మానాలు చేశాయి. తమ హక్కులకొరకై విద్యార్థులు రాజకీయ భేదాలు లేకుండా ఐక్యంగా రోజురోజూ సలిపే పోరాటాలు చూస్తే ఐక్య ఉద్యమం దగ్గర కొచ్చినట్లు కనిపిస్తున్నది. కాని ఐక్య ఉద్యమ నిర్మాణాన్ని కొనసాగకుండా చేయాలని కొందరు విచ్ఛిన్న కారులు కుట్రలు సలుపుతున్నారు. విద్యార్థులు తమ ఐక్య కార్యాచరణ ద్వారా యీ విచ్ఛిన్న కారకులకు పాఠం చెప్పాలి.

భారతదేశాన్ని విడిచిపోతూ బ్రిటిషు సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని చీల్చి స్వదేశ సంస్థానాధీశులను సర్వస్వతంత్రులుగ ప్రకటించారు స్వదేశసంస్థానాల్లోని నిర్బంధవిధానానికి వ్యతిరేకంగా బాధ్యతాయుత ప్రభుత్వం కావాలని, తమ సంస్థానాలు ఇండియన్‌యూనియన్‌లో చేరాలని మైసూర్, హైద్రాబాద్ సంస్థానాలలోని ప్రజలు పోరాటాలు సల్పుతున్నారు. వీరోచితంగా సంస్థానాధీశుల మిలటరీని, పోలీసుల నెదిరించి పోరాడుతున్నారు. అఖిలభారత విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రవీంద్రవర్మ మైసూరు ప్రజల పోరాటాన్ని బలపర్చడానికై ఒక దళాన్ని తీసుకువెళ్ళారు. అచ్చట మైసూరు నిరంకుశ ప్రభుత్వం వర్మనరెస్టు చేసింది ప్రభుత్వచర్యను ఖండించుతూ వర్మగారిని వెంటనే విడుదలచేయాలని మైసూర్ ప్రభుత్వాన్ని కోరుతూ అవనిగడ్డ విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ తూమాటి వెంకటేశ్వరరావు, విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి మాలెంపాటి నర్సయ్యగార్లు కలిపి 25-9-47 న ఒక ఐక్యప్రకటన చేశారు.

* * *

గుంటూరుజిల్లా కొల్లిపరలో స్థానికవిద్యార్థి ఫెడరేషన్, కాంగ్రెస్ వర్కర్ల సంయుక్త సమావేశం జరిపారు. విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షులైన ఆత్మకూరి వెంకట రామవరావు గారుఅధ్యక్షత వహించారు ఇండియన్ యూనియన్‌లో చేరాలని, బాధ్యతాయుత ప్రభుత్వాలు స్థాపించాలని మైసూర్, తెలంగాణా ప్రజలు సాగిస్తున్నపోరాటాన్ని బలపర్చుతూ, మైసూర్ ప్రజల కండగానుండుటకై వెళ్ళిన రవీంద్ర వర్మగారిని, వారి దళాన్నిఅరెస్టు చేయుటను ఖండించుతూ వారిని వెంటనే విడుదల చేయాలని తీర్మానించారు. "నేడు భారతదేశంలో జరుగుచున్న మతకలహాలను నిర్మూలించుటకు భారతయూనియన్‌లోని విద్యార్థులు, పాకిస్థాన్ లోని విద్యార్థులు ఏ రాజకీయపార్టీకి చెందినప్పటికి ఐక్యమై మతకలహాలను నిర్మూలించుటకై ముందుండి మన పాత్రను నిర్వహించాలని"అదే ఐక్యసభలో తీర్మానించారు తరువాత ఆర్థికంగా వెనుకబడియున్న హరిజన విద్యార్థులకిచ్చుచున్న వేతనములను పి వి. కృష్ణయ్యచౌదరి తన హయాంలో రద్దుచేశాడు. అందువలన హరిజన విద్యార్థులు స్వంతంగా జీతాలు కట్టుకోలేక చదువులకు స్వస్తి చెప్ప వలసి వచ్చింది కనుక హరిజన విద్యార్థులు చెల్లించవలసిన జీతములను రద్దుచేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ పై ఐక్యసభలో తీర్మానించడమైనది. తరువాత సత్వరాంధ్ర రాష్ట్ర నిర్మాణానికై విద్యార్థులు ముందుకు రావాలని, పాఠశాలల్లో మాతృభాషలో విద్యాబోధ సల్పాలని, వృత్తివిద్యలు, విద్యార్థినులకు శిశుపోషణ, గృహపరిశ్రమలనుగూర్చి నేర్పాలనికూడ తీర్మానించారు.

విద్యాలయవార్తలు

ఏ. కె. ఆర్. బి.

* * *

డిటెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని, ఉపాధ్యాయుల జీతాలు పెంచుతూ వారి సంఖ్య నభివృద్ధి చేయాలని, యిందుకు "ప్రజలంతా ప్రభుత్వాన్ని వత్తిడి చేయాలని" విద్యార్థులంతా "పార్టీ విభేదాలను వదలుకొని ఐకమత్యంతో మన హక్కులను కాపాడుకోవాలని" ఈపూరుపాలెం (గుంటూరు జిల్లా) విద్యార్థి కాంగ్రెసు సంఘం తీర్మానించింది.

* * *

గత నెల గుంటూరులో డాక్టరు సైప్పు నిరంకుశత్వానికివ్యతిరేకంగా విద్యార్థులుఅంతా ఐక్యకార్యాచరణ సంఘాధ్వర్యాన పోరాటం సలిపి విజయాన్ని సాధించారు డిటెన్షను విధాన నిర్మూలనకై శ్రీ లింగారెడ్డిగారు ఆంధ్రా యూనివర్సిటీ సిండికేటు హాలుముందు నిరశనవ్రతం సాగించినప్పుడు వారికి సానుభూతిగ ఆందోళన జరిపినప్పుడు, విద్యార్థి కాంగ్రెసు, ఫెడరేషనులవారు, రాడికల్ విద్యార్థులు తదితరు లందరితో యీ ఐక్య కార్యాచరణసంఘం యేర్పడింది విద్యార్థిసమస్య లన్నిటిపైన ఆందోళన చేయుటకుగాను, కార్యాచరణసంఘాన్ని యీ సంవత్సరమంతా వుంచాలని అప్పుడే తీర్మానించారు ఈ నెల 6 వ తేదీని ఈ కార్యాచరణసంఘ అధ్వర్యాన జరిగిన విజయోత్సవ సభలో జీతాల పెంపుదలకు వ్యతిరేకంగా, ఆహారసమస్యమీద ఐక్యంగా పని చేయాలని తీర్మానించారు ఆంధ్ర విద్యార్థులు పలుచోట్ల ఐక్యంగా తమహక్కులను రక్షించుకోడానికి ముందుకొస్తున్నారు ఐక్యతారధం కదిలింది ఐక్య విద్యార్థిఉద్యమం జిందాబాద్.

సంపాదకవర్గం

యస్. వి. నరసయ్య (గౌరవ సంపాదకుడు)
ఏ కె ఆర్. బి. కోటేశ్వరరావు (సంపాదకుడు)
వి. వి. దాసు
యం. రామకృష్ణరావు
యన్. వి. నారాయణ (మేనేజరు)

ఫుట్‌బాల్ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలి!

మాదల వెంకటేశ్వరరావు

ఫుట్‌బాల్ ఆటలన్నిటిలోను మణి ముత్యం. ఇది విదేశీయ ఆటయైనప్పటికి దీని ప్రఖ్యాతి మనదేశంలోకిగూడ వ్యాపించింది. దీనిని ఆడిన శరీరములోని అన్ని అవయవములకు శ్రమనిచ్చి యువకుని ఆరోగ్యమునకు తోడ్పడుతుంది. దీనిని వ్యక్తిగత ఖర్చు లేకుండ సామాన్యముగా అందరూ ఆడవచ్చు. ఒక శారీరక సామర్థ్యాన్నే గాక మానసిక నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆడిన దీనిలో అభివృద్ధి పొందవచ్చు. భారతదేశములో కలకత్తా యీ ఆటకు పుట్టినిల్లు. కలకత్తాలో భారతదేశములో మంచి నిపుణులైన అనేక రాష్ట్రాల ఆటగాండ్ర జట్టు (Team) వున్నది. అట్టి



జట్టులో నిపుణులైన ఆంధ్ర ఆటగాండ్రుకూడ వుండి కీర్తిని గడించుచున్నారు.

ఆంధ్రలో దీని పుట్టుపూర్వోత్తరాలు

ఆంధ్రదేశంలో అనేక ప్రదేశాలలో అనేక సం॥ముల నుండి యీ ఆటను ఆడుచున్నారు. కాని పట్టణములలో కొంతమంది చదువరులు మాత్రమే ఆడుతూ వుండేవారు. నెమ్మదిగా పట్టణములలో ప్రతి యువకుడూ ఈ ఆటయందు పుత్సాహము చూపుచున్నాడు. ఇది అంతగా అభివృద్ధి పొందకపోవుటకు కారణం చెడుగుడు మొదలయిన జాతీయ క్రీడలవలె గ్రామసీమలలోని యువకులలోకి పోవక పోవుటయే. ప్రస్తుతం రాజమండ్రి, బెజవాడ, గుంటూరు, ఏలూరు, కాకినాడ మొదలయిన పట్టణములలోని యువకులు, విద్యాలయములలోని యువకులు మాత్రమే ఈఆటను ఆడుతూ అభివృద్ధినిపొంది వారి నిపుణతకు అనేక మన్ననలను పొందుతున్నారు.

ఆంధ్రానుండి భారతదేశ జట్టు (Team) లోనికి

ఆంధ్రదేశంనుండి మొట్టమొదటి సారిగా భారతదేశ టీములోఆడి కలకత్తా ప్రజలముందు ప్రఖ్యాతిగడించినవారిలో అప్పారావు, రాములు, లక్ష్మినారాయణ, బుచ్చి. కన్నయ్య, రహీం (జస్టిస్) మొదలైనవారు ముఖ్యులు. వీరంతా అప్పటినుండి కలకత్తా లీగులో ఆడుతూ లక్ష్మినారాయణ ఈస్టుబెంగాలు టీముయొక్క ప్రఖ్యాతిని, రహీం (జస్టిస్) మహమ్మడెన్ స్పోర్టింగ్‌యొక్క ప్రఖ్యాతిని కాపాడుతూ జస్టిస్ ఆస్ట్రేలియా వెళ్ళుటకు నిర్ణయించిన టీములోనికి తీసుకొనబడ్డాడు. ఈ విధంగా మనరాష్ట్రంనుండి వెళ్ళిన ఆటగాండ్రు అభివృద్ధిని చూపుచూ చివరకు మన అప్పారావే ఈస్టుబెంగాలు టీముయొక్క కెప్టెన్‌గా నిర్ణయించబడ్డాడు. భారతదేశం అప్పారావు లేకుండ యితర దేశములకు టీమును పంపదు. ఇప్డే బెంగుళూరులోవున్న "ఆర్యన్ జింఖానా" లోకూడ మన మూర్తి, సంపెంగలు వుండి దాని అభివృద్ధికి కృషిచేయుచున్నారు. దీనికి మూర్తి సెక్రటరీ కూడ. మొన్న సిలోను వెళ్ళిన ఫుట్‌బాల్ టీముకు మేనేజరుగా పని చేశాడు. దక్షిణాఫ్రికాకు పంపదలచిన టీములో మొట్ట మొదటి వాడుగా నిర్ణయించబడ్డాడు. రేపు లండన్ ఒలెంపిక్ పందెములలో పాల్గొనుటకు వెళ్ళు టీములో దక్షిణ భారతదేశము నుండి నిర్ణయింప బడువారు మూర్తి, సంపెంగలు మాత్రమే.

ఆంధ్రలో అభివృద్ధి లేకపోవుటకు కారణము

ఈ విధంగా యిట్టి ప్రఖ్యాతి వహించిన నిపుణులైన ఆటగాండ్రుండి ఆంధ్రదేశంనుండి ఒక చక్కని టీమును తయారు చేయలేక పోవుటకు కారణం ఆంధ్రలో దీనికి తగిన స్థానంలేక మన ఆటగాండ్రంతా యితరచోట్లకు చెల్లాచెదరై పోవుటయే ఈ ఆటను పట్టణములలోనే మధ్య తరగతి విద్యావంతులైన యువకులలోనేగాక ఆంధ్రదేశంలోని గ్రామ గ్రామానికి వెళ్ళి, యువకులలోనికిమనజాతీయ క్రీడలవలె తీసుకొనిపోయిన యింకనూ అనేక మంది ఆటగాండ్రను తయారుచేసి దీని అభివృద్ధికి తోడ్పడవచ్చు. ప్రత్యేకంగా ఆంధ్రదేశంలో ప్రభుత్వం శ్రద్ధ తీసుకొని మన ఆటలను ముందుకు తీసుకొని పోవుటకు, అన్ని వర్గముల యువకులకు అందుబాటులో నుండునట్లు స్పోర్టింగ్ బోర్డులను, క్లబ్బులను స్థాపించి తద్వారా అభివృద్ధి పర్చవచ్చు.

విద్యార్థి ఉద్యమ ఐక్యతే విద్యా
రాష్ట్ర విద్యార్థి మహా

అక్టోబరు 11, 12 తేదీలలో ఆంధ్రరాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ మహాసభలనే పేరుతో రెండుసభలు జరిగాయి ఒకసభ బెజవాడలోను, మరియొక సభ గుంటూరులోను జరుపబడ్డాయి ఇప్పటికే విద్యార్థి ఉద్యమంలోని చీలికలు విద్యార్థులను అనేక కష్టనష్టాలకు లోను జేశాయి అఖిలభారత విద్యార్థి ఉద్యమఐక్యతకు నేడు జరుగుచున్న ప్రయత్నాలు విని విద్యార్థులు ఉత్సాహపడ్డారు కాని నేటి యీ చీలికలు విద్యార్థి సోదరులను కల్లోలపర్చ ప్రారంభించాయి. ప్రతిఒక్కరూ ఒకేసంస్థ పేరుతో, ఒకేరోజున రెండు సభలు ఎందుకు జరుప వలసివచ్చిందని ప్రశ్నిస్తున్నారు.

పాత చరిత్ర

ఆంధ్ర విద్యార్థి కాంగ్రెస్ ఆరునెలలక్రితం ఏలూరులో జరిగిన కార్యనిర్వాహకవర్గంలో చీలిక లేర్పడ్డాయి తర్వాత అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్ యీ వ్యవహారాలలో కల్గించుకొని రెండువర్గాలమధ్య రాజీజేశారు ఇతర వ్యవహారాలను విచారించుటకు ప్రత్యేక విచారణ సంఘాన్ని నియమించారు ఈ విచారణ సంఘం శ్రీ రవీంద్రవర్మ - అఖిలభారత విద్యార్థికాంగ్రెసు అధ్యక్షుని నాయకత్వాన ఆగష్టు నెలలో బెజవాడ వచ్చారు, అప్పుడు జరపబడిన కార్యనిర్వాహక వర్గసభలో అఖిల భారత విద్యార్థి కాంగ్రెసుచే అంగీకరింపబడిన విద్యార్థి ఐక్యతా తీర్మానమునకు తమ వ్యతిరేకతను జూపుతూ రాష్ట్ర కార్యదర్శిగా పని జేస్తున్న శ్రీ ఎ. యస్ ఆర్ కృష్ణా తన పదవికి రాజీనామ యిచ్చి సమావేశాన్ని వదలి వెళ్ళాడు.

ఈ ఉదంతం అనంతరం జరిగిన విషయాలపై శ్రీ ఎ యస్ ఆర్. కృష్ణా, రంగా గారి సలహాను తీసుకొనగా ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణమును వ్యతిరేకించుటకు ఉన్న పదవికి రాజీనామా యిచ్చుట తప్పని. జరిగిన విషయాలను సరిదిద్దుకొనుటకు శ్రీ ఎ యస్ ఆర్. కృష్ణానే రంగంలో వుండి కార్యదర్శిగా నిలదొక్కుకొని పనిజేయమని సూచించినట్లు తెలుస్తుంది విద్యార్థిఉద్యమంలో చీలికలను ఎల్లకాలం అట్టి పెట్టాలని యిచ్చిన యీ సలహాతో ఏ. యస్ ఆర్ తన వర్గసభ్యులను నంద్యాలలో సమావేశపర్చగా, ఎ. ఎస్, ఆర్, ను రాజీనామా ఇచ్చే ప్రయత్నంనుండి విరమించుకొనమనికోరుతూ తీర్మానించారు ఎ ఎస్ ఆర్. సభ్యుల 'వినతి' పై కార్యదర్శిగా పనిచేయుటకు అంగీకరించారు. ఇంతేగాక రాష్ట్రమహాసభను అక్టోబరు 11, 12 తేదీలలో గుంటూరులో జరుపవలయునని నిర్ణయించారు.

ఎ. ఎస్, ఆర్. కుట్రలు

శ్రీ ఎ ఎస్ ఆర్ కృష్ణావర్గంయొక్క యీ కుట్రలన్నింటినీ చూసి ఎ. ఎస్ ఆర్ వ్యతిరేకులు రెచ్చిపోయారు రాష్ట్ర విద్యార్థి కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ కృష్ణారెడ్డి, అధ్యక్షునిగా గుడివాడలో కార్యనిర్వాహకవర్గ సమావేశం జరిపాడు ఇందులో సోషలిస్టు విద్యార్థులు. ఎ ఎస్ ఆర్. వ్యతిరేకు లందరూ పాల్గొని గుంటూరులో జరుపనెంచిన సభ చట్టసమ్మతమైనది గాదని, చట్టసమ్మతమైన రాష్ట్రసభను అదేతేదీలలో తెనాలిలో జరుప్పటకు ఒక కమిటీని నియమించారు. గుడివాడ కార్యనిర్వాహకవర్గం యీ నిర్ణయంతో రెండు సభలు జరగటం నిశ్చయమైంది దీనికితోడు రాష్ట్ర కాంగ్రెసులోని ముఠాలు యిందుకు తోడుపడ్డాయి. గుంటూరు సభా ప్రయత్నాలను రంగా గ్రూపువారు భుజానవేసుకొన్నారు. రంగాగ్రూపు ముఖ్య నాయకులు వచ్చి గుంటూరులో మకాంవేసి మహాసభప్రయత్నాలు ప్రారంభించారు, ఇటు తెనాలిలో నిర్ణయించిన సభను చివరినిముషంలో బెజవాడ మార్చారు, బెజవాడలో చిట్టివర్గంవారు గుంటూరు సభకు పోటీగా అన్నిసదుపాయాలూ, డబ్బువసూళ్ళకు పూనుకొని రెండవమహాసభ ప్రయత్నాలకు బాధ్యతవహించారు

నాయకత్వపు కీచులాటలు

ఎ. యస్ ఆర్ వర్గం విద్యార్థిఉద్యమంలో అభివృద్ధి అవుతున్న విద్యార్థి ఐక్యతనుజూచి బెదరిపోయి, తమ నాయకత్వమును నిల్పుకొనుటకు గుంటూరుసభ ప్రయత్నాలకు దిగారు రాష్ట్రంలోని విద్యార్థి కాంగ్రెస్‌లోని వివిధ వర్గాలుపాల్గొన్న సభలో తమ ఐక్యతావ్యతిరేక ధోరణికి తావులేదని వారికితెలుసు అందుచేత విద్యార్థి కాంగ్రెస్‌సంస్థ విచ్ఛిన్నానికే పూనుకొన్నారు, ఇటు శ్రీకృష్ణారెడ్డివర్గం ఎ. యస్. ఆర్ కృష్ణాకుట్రలను విద్యార్థులముందు బహిరంగ పర్చలేకపోయారు. విద్యార్థి కాంగ్రెస్ ఐక్యతను నిలబెట్టుటకు ఐక్యతా శక్తులనెల్ల సమీకరించి గుంటూరు సభలో పాల్గొనిన ఎ. యస్ ఆర్ కృష్ణ కుట్రలు భగ్నం జేయగల్గియుండేవారు తాత్కాలికంగా అయినా విద్యార్థి కాంగ్రెస్ ఐక్యతను నిల్పగల్గేవారు. కాని శ్రీ కృష్ణారెడ్డి గూడ విద్యార్థి ఐక్యతను కోరిగాక, తనముఠాతత్వాలతో మాత్రమే పనిచేయుటచే యీ పంథాను తొక్కలేకపోయాడు సోషలిస్టు విద్యార్థులు సహితం విద్యార్థికాంగ్రెసు ఐక్యతకు పై పంథాను అనుసరించిన, పరిస్థితులు వేరు రూపంలో యుండేవి.

ప్రతినిధులలోని ఐక్యతా వాంఛ

ఎ యస్ ఆర్ వర్గం తమ అధీనంలో రాష్ట్ర ఆఫీసును సంవత్సరములనుండి యుంచుకొని యుండుటచే స్థానికసంఘముతో తమ ప్రత్యర్థులకన్న బలమైన సంబంధాలు కల్గియున్నారు దీనిఫలితంగా ఎ యస్ ఆర్, గ్రూపు సభకు, - బెజవాడ సభకన్న హెచ్చు ప్రతినిధులు వచ్చారు, గుంటూరు సభకు 300 మంది ప్రతినిధులు వచ్చారని, బెజవాడకు 180 మంది మాత్రమే వచ్చారని తెలుస్తోంది.

మహాసభకు హాజరయిన ప్రతినిధులలో సహితం విపరీతమైన కలత కన్పించింది, రెండుసభలు జరుగుటకు వారు వ్యతిరేకులు. ఎ యస్ ఆర్ వర్గం వచ్చిన విద్యార్థులలో ఐక్యతను గోరేవారిని ప్రతినిధులుగా అంగీకరించి తిరస్కరించారు అయినా యీ గ్రూపు సభ ప్రారంభింతగానే 80మంది దాదాపు ప్రతినిధులు యీ సభ జరగ

మస్యల పరిష్కారమార్గం

ఫల సమీక్ష

గాదని రెండువర్గాలు ఐక్యమయ్యే వరకూ సభను వాయిదా వేయుమని ప్రతిపాదించారు. అధ్యక్షుడు యీ ప్రతిపాదనను తోసివేయుటతో అసమ్మతి సూచకంగా వీరు సభను వదలి వెళ్ళారు. మిగిలియున్నవారిలో సైతం విద్యార్థి ఐక్యతను వ్యతిరేకిస్తూ తెచ్చిన తీర్మానంపై తీవ్రచర్చలు జరిగాయి. ఎ. యస్. ఆర్. వర్గానికి కలత కల్గించునట్లుగా లోన ఉన్న ప్రతినిధులు సహితం వీరి ఐక్యతా వ్యతిరేక ధోరణిని వ్యతిరేకించారు.

ఇటు బెజవాడసభలో ప్రతినిధుల సమావేశాలంటూ తగినంత శ్రద్ధతో జరగలేదు. అఖిలభారత విద్యార్థికాంగ్రెసు విద్యార్థి ఐక్యతనుగోరి ఉదయపూర్ కార్యవర్గంలో అంగీకరించిన తీర్మానమును బలపర్చారనితెలుస్తుంది. ఎ. యస్. ఆర్. వర్గం వారు విద్యార్థి ఐక్యతను వ్యతిరేకిస్తూ గుంటూరు బహిరంగసభలో ఉపన్యాసాలు ప్రారంభింపగనే ప్రజలు ఆశ్చర్యపడుతూ సమావేశాన్ని వదలి వెళ్ళటం ప్రారంభించారు. బెజవాడ సభలో విద్యార్థి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నుకొనబడిన శ్రీ యన్. వి: యస్. ప్రసాద్ రావు విద్యార్థి ఐక్యతావసరమును నొక్కిచెప్పడం సంతోషించవలసిన విషయం. బెజవాడసభలో తమ స్థానికసంఘాలను వివిధ సమస్యలపై యితర విద్యార్థిసంఘాలతో కలసి పనిచేయమని సూచిస్తూ తీర్మానించినట్లు తెలుస్తుంది.

రెండు సభలకూ వచ్చిన ప్రతినిధులలో సభాకార్యక్రమంలో తగినంత పట్టుదల కన్పించలేదు. ఒక సభలో ఒకపూట ఉండి, రెండవ సభకు రెండవపూట వెళ్ళడం, మరుసటిరోజు తిరిగిరావటం- ఇలా గుంటూరు, బెజవాడలకు అనేక ప్రతినిధులు ఆరెండురోజులూ తిరుగుతుండేవారు. గుంటూరులోను, బెజవాడలోను బహిరంగసభలకు ముందు ఊరేగింపులలో వచ్చిన ప్రతినిధులుగూడ పాల్గొనలేదు. 130 తో గుంటూరులోను, 50 మందితో బెజవాడలోను ఊరేగింపులు జరిపారు. ఈ విషయాలు విద్యార్థికాంగ్రెసులోని విచ్ఛిన్నత ప్రతినిధులలో సైతం ఎంత నిరుత్సాహాన్ని వ్యాపింపజేసిందీ స్పష్టపర్చుతాయి.

నేటి కర్తవ్యం

విద్యార్థిఉద్యమంలో 1942 సం- ఏర్పడ్డ చీలికలను నిరంకుశ విద్యాలయాధికారులు పూర్తిగా వినియోగించుకొన్నారు. నేడువిద్యార్థి ఉద్యమంలో ఐక్యతను నెలకొల్పేప్రయత్నాలు వీరిగుండెలలో రాళ్ళుపడవేశాయి. అందుచేత మతదురహంకార సిద్ధాంతాలను విద్యార్థులలో రెచ్చగొట్టి ఆర్. యస్. యస్. ను వీండ్లు పోషిస్తున్నారు.

దేశంలో మతకలహాలలో మనజాతీయ ప్రభుత్వానికి ప్రమాదమేర్పడింది. నెహ్రూ ప్రభుత్వాన్ని విచ్ఛిన్నపర్చ అభివృద్ధినిరోధకులెల్ల, సామ్రాజ్యవాదులతో కలసి కుట్రలు పన్నుతున్నారు. మతకలహాలనురోజురోజుకూ ఉధృతంజేయ ప్లానులువేస్తున్నారు. ఇంతవరదాకా మతకలహాలతో దూరంగాఉన్న మన ఆంధ్రభూమికిగూడ మతకలహాలు వ్యాపింపజేసేప్రయత్నాలు తీవ్రంగా జరుపబడుతున్నాయి. కలకత్తా, ఢిల్లీవిద్యార్థులవలె, ఆంధ్ర విద్యార్థులు తమలోసంపూర్ణఐక్యతను నిర్మించి ఆంధ్రదేశాన్ని మతకలహాల ప్రమాదంనుండి రక్షించవలసియుంది.

విద్యావిషయాలలో అనేక సంస్కరణల కొరకు ఆందోళన జేయవలసియుంది. దేశ పునర్నిర్మాణ కార్యక్రమంలో విద్యార్థులు ముందుండి నడుపవలసియుంది.

ఇట్టిమహత్తర కర్తవ్యాలను విద్యార్థులు నెరవేర్చుటకు విద్యార్థి ఐక్యత లేనిది ఎలా సాధ్యం. నేటి విద్యార్థి కాంగ్రెసు నాయకులు తమ వ్యక్తి ప్రయోజనాలకు ఉన్న చీలికలు చాలవన్నట్లు-నూతన చీలికలను నిర్మించారు. విద్యార్థి కాంగ్రెసు కార్యకర్తలు, విద్యార్థి సోదరులు యీ అనైక్యతను తుంచివేయుటకు పూనుకోవాలి. విభేదాలను వదలి ప్రతిసమస్యా పరిష్కారమునకు ఐక్య కార్యాచరణ సమితులను నిర్మించాలి. అన్ని పక్ష విద్యార్థులకు అందులో స్థానమివ్వాలి. అభిప్రాయ భేదాలను మిత్రులుగా చర్చించి, తొలగించుకొనే ప్రజాస్వామిక పద్ధతిని అనుసరించాలిగాని-నిరుపయోగమైన ద్వేషాలతో చీలికలను పెంపొందించుట విద్యార్థులకు మేలుజేయుటగాదు. అఖిల భారత విద్యార్థి ఐక్యతా నిర్మాణమునకు పునాదులు వేసిన 'ఉదయపూర్' తీర్మానాన్ని ప్రతి విద్యార్థీ బలపర్చాలి. అప్పుడే నేటి యీ చీలికకకు, నిస్సహాయస్థితికి స్వస్థి చెప్పగలం. ఆంధ్ర విద్యార్థుల కోర్కెల సాఫల్యతకు ఆంధ్ర విద్యార్థి సంస్థలు ఐక్యపోరాటాన్ని జరపగలవు. విద్యార్థిఉద్యమ అభిమానులెల్లరూ యీమార్గాన ముందుకు నడుస్తారని ఆసిస్తాం.

సప్లిమెంటు

యువజన, విద్యార్థి మహాసభల తీర్మానాలతో నవంబరు సంచికతోపాటు సప్లిమెంటు ప్రచురిస్తామని ప్రకటించాం. కాని న్యూస్ ప్రింటు కొరతవల్ల, మరికొన్ని అనివార్య కార్యాలవల్ల యీ సప్లిమెంటు ముద్రణను విరమించుకోవలసి వచ్చినందుకు విచారిస్తున్నాం.

పాఠకులకు కల్గించిన యీ ఆశాభంగానికి క్షమిస్తారని తలుస్తాం.

ఇట్లు
మేనేజరు : "నవయుగ"



విజ్ఞాన విజయాలు



ఆవుపాలకంటె ఉత్తమమైన సోయా చిక్కుళ్లనుండి

ప్రపంచంలోని ప్రతివ్యక్తి 'పాడి పంటల' మీద ఆధారపడి యున్నాడు. అయితే మన దేశంలో యీ "పాడి - పంట"ల పరిస్థితి ఎలా ఉన్నదీ మనకందరికీ తెలుసు. పాడి పంటలకు స్థావరమైన మన భారతభూమి బ్రిటిషు ప్రభుత్వ పీడ పరిపాలనా పద్ధతివలన కరువు కాటకాలకు రంగస్థలమైంది. మన పశుసంపద నానాటికి క్షీణించి పోతూంది. పోయినసంవత్సరం రాయలసీమలో గడ్డిలేక గుట్టలుగుట్టలుగా పశువులు చనిపోయిన దృశ్యాలు మనం చూచాం,

మనకు వరి అన్నం, కూరలు తర్వాత పాలు ముఖ్యాహారం. రోగులకు, చిన్నపిల్లలకు పాలే ముఖ్యాహారం. అయితే మన నిత్యాహారంలో ఈ పాల యొక్క విలువ యెంత వున్నదో యీ క్రింది పట్టికవలన తెలుస్తుంది. ఒక 'క్వార్టు' పాలు రోజూ నీకు కావలసిన — వాటిలో మాంసకృత్తులు నూటికి 45 పాళ్ళు యిస్తాయి

కెలొరీలు	..	20	..
భాస్వరం	..	66	..
క్రొవ్వు పదార్థాలు	..	33	..
కాల్షియం	..	14.5	..
విటమిను 'ఎ'	..	33	..
'బి'	..	14	..
'సి'	..	100	..
నియాసిన్	..	20	..

అయితే యింగ్లాండు, కెనడా, న్యూజిలాండు మొదలగు దేశాల్లో ఒక్కొక్కరికి రోజుకు దాదాపు 40 ఔన్సులపైన పాలు లభించుతుంటే - మనమో రోజుకి ఒక్కొక్కరికి 5 ఔన్సులతోనే కాలం గడుపుతున్నాం. ఈ పశుసంపదను అభివృద్ధి పొందించేవరకు మనం యీ విధంగానే బలహీనమైన ఆహారంతోనే గడపాలా ? అనే ప్రశ్న నేడు మన శాస్త్రజ్ఞుల నెదుర్కొన్నది. చైనా, రష్యా, అమెరికా దేశాలలో పశువుల పాడికొరత అయ్యేప్పటికి పాడికొరతను తీర్చటానికి కృషిచేసి "సోయా చిక్కుళ్ల"నుండి పాలుతీసి అవి మానవునికి ఆవుపాలకంటె నయమని శాస్త్రజ్ఞులు రుజువు చేశారు.

మన శాస్త్రజ్ఞులుకూడా వేరుశనగపప్పు నుండి తీసిన పాలు మనదేహానికేమైనా ఉపయోగించుతాయా అని పరిశీలించి చూచారు. కాని ప్రయోజనం లేకపోయింది. అప్పుడు వారి దృష్టి యీసోయా చిక్కుళ్ళమీద పడింది. మనదేశంలో వేరువేరు చోట్ల శాస్త్రజ్ఞులు యీ సోయాపాలు మన శరీరానికి సరిపోతాయా యని పరిశీలనలు చేస్తున్నారు. అందు "ఇండియన్ సైన్సు, ఇన్‌స్టిట్యూట్" బెంగుళూరు - శాస్త్రజ్ఞులు-యీ విషయంలోసఫలతపొందామని వారు తెలియచేశారు. వారేవిధంగా సోయా చిక్కుడు గింజలనుండి పాలు పిండారో, వాటి ప్రయోజనాలను గురించికూడ చెప్పారు.

'సోయా చిక్కుళ్ళు' అంటే ఏమిటి అనేది మనకు సందేహం కలుగవచ్చు. ఈ పంట మన పెసర, మినుపమొక్కల్లాగానేఉంటుంది. వరికోతలు కోసిన తర్వాత మాగాణిలోను, మామూలు మెట్టపైరుగాను పండించవచ్చు. గింజలు మామూలు అలసందగింజల మాదిరిగా కొంచెం పెద్దవిగా ఉంటాయి. వీటిలో నలుపు, తెలుపు, లేత పసుపుపచ్చ వన్నెగల రకరకాలగింజలున్నాయి. ఎకరానికి యేవిధంగా పండినా 800 పౌనులు గింజలు రాల్తాయి. ఇకపాల నేవిధంగా పిండుతారోకూడ వాళ్ళుతెలియ జేసారు.

పాలను తయారుచేసేవిధం

సోయాచిక్కుళ్ళను కావలసినవన్ని తీసుకొని మనం మినపప్పునీళ్ళతో నానబెట్టినట్లు - కొంచెం మొలకెత్తేవరకు నానపెట్టిన తరువాత పైపొట్టును మినపప్పుమీద పొట్టుతీసినట్లుగానే ఎక్కువనీళ్ళతో వడగట్టి, పప్పును - పొట్టును వేరుచేయాలి.

నానబెట్టిన తరువాత కొంచెం ఎండబెట్టి పొట్టుతీసినట్లయితే ఊరికనే వచ్చేస్తుంది. చక్కని దాయపప్పుగా తయారవుతుంది. అది ఎంతకాలమైనా నిలువవుంటుంది. ఇది కందిపప్పు వండుకున్నట్లు - భోజనంలోకి వండుకోవచ్చునా ? అనేదికూడ పరిశీలించారు. ఆవిధంగా వండినపప్పును తినుటవల్ల ఎక్కువ మందికి అజీర్తిరోగముత్పన్నించింది. అందుచే ఆ విధంగా వాటిని ఉపయోగించలేం, పోతే ఈ సోయాచిక్కుళ్ళు పాలుతీయటానికి మనకు సరిపోతాయి.

తరువాత యీపప్పును నీళ్ళలో నాలుగైదు గంటలునానబెట్టి దానికి సోడాపుప్పు (1000 పాళ్ళనీళ్ళకు- 1 పాలు సోడాపుప్పు) కలిపి దాదాపు చెయ్యి పట్టనంత వేడి (70°c)లోఉండేటట్లు పదినిముషాలసేపు పొయ్యిమీదవేడి చేయాలి (దీనితో వెగటుగల రంగుపదార్థం పప్పునుండి వేరుపడుతుంది). పైనున్నగంజిని నెమ్మదిగా క్రిందనున్న పప్పుకదలకుండా వీలైనంతవరకు తోడిపారవేయాలి.

తరువాత మిగిలిన పదార్థంలో ఎక్కువగా చన్నీళ్ళుపోసి - నీళ్ళను వడియగట్టాలి.

ఈ విధంగా పప్పు తెల్లగా అయ్యేవరకు నీళ్ళతో వడగట్టడం జరగాలి. అప్పుడు మనకు కొంచెం వక్కపలుకు వాసనవస్తుంది. తదుపరి దీనిని వీలైనతిరుగలలోవేసి మెత్తగా విసరాలి. పిండికి మూడింతలు నీరుపోసి కొంచెం సోడాపుప్పు కలిపి - మధ్య మధ్య కలుపుతూ మైదాపిండి ఉడకబెట్టినట్లు ఉడకబెట్టాలి. మధ్య మధ్య పాలు పొంగినట్లు పొంగులు వస్తాయి. కనుక కొంచెం జాగ్రత్తగా ఉండటం అవసరం. ఈ విధంగా 15—20 నిమిషాలసేపు ఉడకబెట్టిన పిదప - పొయ్యిమీదనుంచి దింపి - చల్లారనిచ్చి లోపల పదార్థాన్ని తేరుకోనివ్వాలి. కొంచెం వేడిగా ఉండగానే చక్కటి,పలుచని గుడ్డద్వారా తొందరగా వడపోయాలి - లేకపోతే పాలమీద గట్టిన

పాలను తయారు చేసుకోవచ్చు!

పాలు తీసే విధానం

“రామచంద్ర”

మీగడవంటి పదార్థం మిగిలిపోతుంది. వడ పోయగా గుడ్డలో మిగిలిన పిప్పిని వేరేతీసి - కారప్పూస గిద్దల్లాంటి వాటిలో పెట్టి నొక్కి - మిగిలిన కాస్తపాలను పిండాలి - మిగిలిన పిప్పిని గొడ్లకుపయోగించవచ్చు - వడపోసిన పుడు చిక్కటిపాలు క్రిందికిదిగుతాయి. ఈ పాలకు కొంచెంఉప్పు (100 పాళ్ళ పాలకు - 1 పాలుఉప్పు) కలిపిన రుచిగావుంటాయి.

ఈ పాలలోవున్న ఆహార విలువ ఏమిటి?

ఈ పాలల్లో - ఆవు పాలలోవలే సున్నం (‘కాల్షియం’) లేదుకాబట్టి - కొంచెం సరిపడినంత రాతిగోశీకాయ పొడినివేసిన బాగుంటుందని పరిశోధకులు చెప్పారు. ఈ పాలు మామూలు ఆవుపాలవలెనే పంచదార కలిపి వాడుకోవచ్చు. 48 గంటలవరకు చల్లటిగదిలో పెడితే చెడిపోవు. మామూలుప్రదేశంలో ఆవు పాలకువలెనే నిల్వఉంచవచ్చు 12 గంటల వరకూ చెడిపోవు

ముఖ్యవిషయ మేమంటే ఈపాలలోనున్న మాంసకృత్తుల (Protein) మామూలు ఆవు పాలలోఉన్న మాంసకృత్తులకంటె ఎక్కువ జీర్ణశక్తి కలిగిఉంటాయి

సోయాపాలు మాంసకృత్తుల, జీర్ణశక్తి నూటికి 92 పాళ్ళు, ఆవుపాలు 88 పాళ్ల.

పరిశోధనలు

విటమిను ‘బి’ రెండింటిలోను సమానంగా ఉంటుంది.

అయితే పరిశోధకులు యీపాలతో కొన్ని ప్రయోగాలుచేసి విజయంపొందారు.

బెంగుళూరులో బిడ్డల సంరక్షణశాలల్లో యీపాలతో ప్రయోగం చేశారు. అందు 120 మంది పిల్లల్లో కొన్ని నెలలనుండి - 6 సం॥ వరకు వయస్సుగల పిల్లలున్నారు. వారిలో సగంమందికి ఆవుపాలు, మిగతాసగం మందికి సోయాచిక్కుళ్లపాలు రోజూయిచ్చే వారు ఆవుపాలిచ్చిన పిల్లలకంటె - సోయా పాలిచ్చిన పిల్లలు - కొంచెం తేటగాఉన్నారట. కాని 6 సం॥ల పిల్లలు - రెండింటిలోనూ సమానంగానే ఉన్నారట.

బిడ్డల ఆస్పత్రులలోకూడ యీప్రయోగం జరుగుతూంది. అక్కడకూడ ఫలితాలు సుగుణంగానే ఉన్నాయట.

మామూలు స్కూలు చిన్నపిల్లలకు ఐదు వేలమందికి రోజూ మధ్యాహ్నం 4 ఔన్సుల పెరుగు, 8 ఔన్సుల అన్నం యిచ్చేవాళ్ళు - ఇందులో రెండువంతులు సోయాపెరుగు, ఒకవంతు ఆవుపెరుగిచ్చేవారు. పిల్లలఆరోగ్యం చెడిపోలేదు సరికదా వారు కొంచెం తేటపడ్డారు.

అంతేకాదు, ఆవుపెరుగుకంటే - సోయా పెరుగుకు తొందరగా జీర్ణమయ్యే శక్తిఉందని శాస్త్రజ్ఞులుచెప్పారు.

చిన్న పిల్లలకు, బలహీనులకు, అజీర్ణ రోగం కలవారికి యీ పాలు అమృతంలాగా పనిచేస్తున్నాయట. పాలలో పిండి పదార్థమేమీ ఉండదు. ఈ పాలల్లో అదివరకే ఉడకబడిన మాంసకృత్తులుండుటచే తేలిగ్గాజీర్ణమవుతాయి. “మధుమేహం” “డయబెటిస్” జబ్బుగల వారికిపంచదార కలుపకుండా యీ పాలు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి

మనం గేదె పాలకు, ఆవు పాలకు మాత్రమే అలవాటు పడియున్నాం కాని ఒక గమ్మత్తు. చైనా దేశీయులు ఎక్కువగా యీసోయాపాలు మాత్రమే వాడుతారట. వాళ్ళు ఎప్పుడైనా ఖర్మంచాలక ఆవుపాలు వాడితే అజీర్ణ రోగం పుడుతుందట. కాని మనం యీ సోయాపాలకు అలవాటుపడిన కొద్దీ రుచి మరిగిపోతామని శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు.

అయితే యీ పాలు డబ్బుగల వారికే అందుబాటులో ఉంటాయా లేక బీదల కుపకరిస్తాయా యనేదికూడా ఆలోచించారు.

ఈ చిక్కుళ్ళు ఒకపౌను మూడణాలు ఖరీదు. 1 పౌను చిక్కుళ్ళు, 2 శేర్ల పాలు దాదాపు యిస్తాయి అయితే - మనంపడే శ్రమను కూడ కలుపుకుంటే ఒక శేరుపాలు మూడణాల కంటె హెచ్చుకాదు.

అందుచేతనే సోవియటు రష్యాలో పంచవర్ష ప్రణాళికలో సోయా పంటను బాగా అభివృద్ధి చేయటానికి ప్లాను వేసుకొన్నారు వాళ్ళు వందలకొలది రకాల పదార్థాలు ఈ పాలతో తయారు చేసికొంటున్నారు. కాని పంటల్లోనే కాకుండా - పాడిలో కూడ వెనుకబడిన మన దేశంలో యీ విషయమై ఆహార ప్రణాళికల్లో చేర్చి మన పాల కొరతను తీర్చి - మనం ఆరోగ్యంవంతంగా పురోగమించ వచ్చు.

తిండి కలిగితె కండగల దోయ్
కండకలవాడేను మనిషోయ్.

(‘సైన్సు అండ్ కల్చర్’లోని వ్యాసాన్ననుసరించి)

★

విజయోత్సవగీతం

శ్రీ తెన్నేటి సూరి

బుట్టబొమ్మలు

★

విజయోత్స వమ్ములో,
వీధిలో ఊరేగ
వీరులంతా లేరచే ?
దేశాన
ధీరయువకులు మేరచే ? ॥విజ॥

లాఠీల నెదిరించి
తూటాల కెదురీది
స్వాతంత్ర్య సమరాన
చావమిగిలినవారు
వీరులంతా లేరచే ?
దేశాన
ధీరయువకులు మేరచే ? ॥విజ॥

విజయోత్సవమ్ములో
వీధిలో నూరేగ
బుట్టబొమ్మలు దేనికే ?
వీటిలో
బూజా 'జస్టిసు' లెందుకే ! ॥విజ॥

క్రొత్తఖద్దరు పంచ
క్రొత్తఖద్దరు లాల్చి
రావుసాహెబు చూడు !
రంగుల్లు మార్చేను,
బురఖాలు తగిలించిరే !
ఓ చెల్లా !!
పగటివేషా లొచ్చెనే ! ॥విజ॥

తిండిదొంగలు, పట్టి
దిక్కుమాలిన సరుకు
బ్లాకుమార్కెట్టులో
పేరుబడ్డా సరుకు
బుట్టబొమ్మలు చూడవే !
వీటిలో
తిండిదొంగ లిదేమిచే ! ॥విజ॥

న్యూయార్కు కాటనుకు
నోటుకెక్కిన సరుకు
తాగుళ్ళ జూదాల
తందనాలా సరుకు
పగటి వేషాలొచ్చెనే !
ఎబ్బెబ్బె !
సారాయి కంపేమిచే ! ॥విజ॥

ప్రజల ప్రాణాలపై
బాగుపడ్డా సరుకు
అన్నాలు దాచేసి
హత్యజేసే సరుకు
తిండిదొంగలు గాదుచే ?
ఓచెల్లా !
పగటి వేషాలేసిరే !!

పెత్తనం కోసమీ
పేటలో ఊరేగు
బుట్టబొమ్మలు చూడవే !
వీధిలో
పగటి వేషాలొచ్చెనే ! ॥విజ॥

కూడుబెట్టే రైతు
మాడి పోతున్నాడు :
కూలి జేసేతల్లి
మంచాన కన్నీరు.
రక్తబలి యెవరికోసం ?
యోధుల్లు
రాలినది యెవరికోసం ? ॥విజ॥

కష్టమంతా ఒకరు
కళ్యాణ మింకొకరు
పెత్తనం గావాలిచే !
బురఖాలు
పేలిపడటం చూడవే !! ॥విజ॥

బాలసంఘముకు రారండీ!!

రచన "సాంబ"

అదుగో అదుగో
బాలల్లారా
అరుగులమీద
చేరీమీరు
అల్లరిచేయగ
నెంచితిరా ?

అల్లరి గిల్లరి
మానేసేసి
కల్లాకపటం
విడిచేసేసి
పిన్నల పెద్దల
మన్ననలపొందిన
బాలసంఘముకు
రారండీ !

పాతుకుపోయిన
మూఢమతాలు
కూటికి రాని
కులతత్వాలు
నీతీలేని
నియంతృత్వమ్ములు
కోటలు దాటిన
గూండాతనములు
కాలరాయుచు
గంగకలుపుచు
ఛంగుఛంగున
బాలసంఘముకు
కదలీ రారండి !!

బానిసవిద్యను
పారగద్రోలి
తల్లిబాసలను
తలచుకుంటూ
తోటివానితో
చేయి గలుపుచు
దౌష్ట్యబుద్ధిని
తరిమికొట్టుచు
దశదిశల నా
దర్శప్రాయుల
సామ్యవాద
సౌహార్ద్ర బాలుర
వియత్నామ్
విజ్ఞానవీరుల
అడుగుజాడలలో
అడుగులు వేస్తూ
విశ్వమంతటా
వన్నెకెక్కగా
వేడుకమీరగ
బాలసంఘముకు
రారండీ !!!

['నవజగతి' అను లిఖిత మాసపత్రిక నుండి]

పల్నాటి యుద్ధం

ధండమూడి మహారధకుమార్

కీ॥ శే॥ గూడవల్లి రామబ్రహ్మంగారిచే సృష్టింపబడి 'ప్రసాద్' దర్శకత్వం క్రింద తీయబడిన తెలుగు సినిమా 'పల్నాటి యుద్ధం' విడుదలయింది.

దీనిలోని కధ ఈ నాటి పరిస్థితులకు ప్రతిబింబంగా వుంటుందని. నేటి సాంఘిక రాజకీయ సమస్యలకు సరియైన సమాధానం కాగలదని వూహించి పాత క్రొత్తల సమన్వయం కోసం యత్నించారు

ఇది ఒకచారిత్రిక చిత్రం ఆంధ్రావని వీర గాధల్లో వీర పల్నాటి కధ ఎంతో ఖ్యాతి గాంచింది ప్రతిపల్లెలోనూ ప్రతివాడలోనూ ఎంతో ప్రాపకంలో వుంది. ఇలాంటి కధను 'శారదా ప్రొడక్షన్స్' వారుతెరపై కెక్కించి తెలుగు ప్రేక్షక లోకానికి అందించారు. చారిత్రిక చిత్రాలు తీసేప్పుడు 'చరిత్ర' ను చెదరనీయకూడదు సంవత్సరాలకొలది చరిత్ర అంటే ప్రజలలో వున్న భావాన్ని ఒక్కసారిగా రబ్బరుతో తుడిచేయడం చరిత్రను కాల ద్రోసినట్లవుతుంది ఆనాటి కాల పాత్ర ఔచిత్యాలకు అవాంతరం కలిగించకుండా కడు జాగరూకత వహించాలి చరిత్రలో వాస్తవికత్వం విహితమైయుంది, ఈ నాడు సినిమా రంగంలో చారిత్రిక సినిమాలంటూ చరిత్రకు ప్రక్కప్రక్కగా నడిచి చరిత్రను ఖూనీచేసిన సినిమాలలో 'పల్నాటియుద్ధం' ఒకటి

మూలకధ తెలియనివాళ్లు క్రొత్తదనాన్ని ఫీల్' అవుతారు, మామూలు ప్రజానీకానికి అర్ధం కాక తి క మ క పడేందుకు పూర్తి అవకాశంవుంది

బౌద్ధమతం క్షీణించి వైష్ణవ సాంప్రదాయం ప్రబలుతున్న ఆరోజుల్లో బ్రహ్మనాయుడు వైష్ణవ మతాన్ని అవలంబించాడు నాగమ్మ శైవసిద్ధాంతాల్నీ ఏకేశ్వరోపాసనను అభిమానించింది మతం పేరిట మనస్పర్ధలు ఏర్పడ్డాయి ఈర్ష్యా స్పర్ధలకులోనై అధికారాకాంక్షీ అయిన బ్రహ్మన్న పలనాటి విభజనకు పూర్తి యత్నం చేస్తాడు. కాని నాయకురాలు పల్నాడు' ఒకటిగా వుండాలని తపకుటిల నీతిని ప్రయోగిస్తుంది ఈ ఈర్ష్యా స్పర్ధల ప్రాతిపదికగా 'పల్నాటి యుద్ధం' ప్రారంభమవుతుంది ఆ యుద్ధంతో మత యుద్ధం సమసిపోదు. శైవమత ప్రచారం సాగుతూనే వుంటుంది మత సామరస్యం సాధ్యపడలేదు

ఈ 'పల్నాటి కధను' 'శారదా స్రష్టలు' క్రొత్తదనపు మూసలోపోసి చరిత్ర పరిహద్దుల్ని అతిక్రమించారు ఇది చరిత్రకు తీరని అపచారం.

నేటి పరిస్థితులకు అనువుగా నవీన ఆశయాలు కల్పించి బ్రహ్మన్నను గాంధీజీవలె హరిజన ప్రవక్తగానూ, అహింసా, శాంతిదూతగానూ, చిత్రించాలని యత్నించారు కాని ఇది చరిత్రను అధిగమించడమేఅవుతుంది 'చరిత్ర కళ్ళ అద్దాలతో చూచినప్పుడు ఈపాతక్రొత్తల సమన్వయం తికమకగా, అతుకతుకుగా కనబడుతుంది 'శారదా ప్రొడక్షన్స్' వారు ఈ మార్పులను ప్రవేశపెట్టడం అవసరమనిభావించవచ్చు కాని ఇవి లోపాలుగానే అగుపిస్తున్నాయి

ఈ చిత్రంలో నాయకురాలిచేత 'దేశమంటే మట్టిగాదు, ప్రజలే దేశం' అని చెప్పించడం, 'అఖండ పల్నాడుసర్వమానవకళ్యాణ మనడం, ఆంధ్రుణం' అనే సంభాషణలు బలవంతంగా వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా అతికించడం చరిత్రకు తీరని అపచారం! ఇలాంటివి అంటించడం - ఒక చలనచిత్ర విమర్శకుడు చెప్పినటు- వృద్ధనారికి లోలకులు పెట్టివాల్జడవేసి మేజువాణీ వేయించినట్లే అవుతుంది

చిత్రం మొత్తంలో పలనాటి ఆ నాటి వాతావరణం పూర్తిగా చూపబడక పోవడం కడు శోచనీయం ! ఇందువలన పల్నాటియుద్ధం చారిత్రక ఫిలుంగా సఫలంకాక ఒక సాంఘిక చిత్రమయి కూర్చుంది

ఈ చిత్రంలో బాలచంద్రుడు - మాంచాల ప్రణయ సమావేశం విస్తృతంగాచూపబడింది. ఆ సన్నివేశం కొంత తగ్గిస్తే బాగుండుననిపిస్తుంది బాలచంద్రుని యుద్ధానికి సాగనంపేప్పుడు మాంచాల పాడిన పాటలో ఉత్తేజం వుంది, కాని ఆమె మాటల్లో ఏమంత ప్రౌఢతనం కన్పించలేదు.

పేరమ్మ సహగమనదృశ్యం. ప్రేక్షక హృత్తంతుల్ని కదిల్చివేసింది. అత్యంలో బ్రహ్మన్నకు చెన్నకేశవభగవానుడు సాయపడినట్లు చూపడం చిత్రంలో చూపిన నవీనభావాలకు దెబ్బగాతోస్తుంది ఇదేవిధంగా వాస్తవిక చరిత్రను మరుగుపరుస్తూ నాగమ్మ లొంగిపోయినట్లు చూపించినదృశ్యం చరిత్రను పూర్తిగా మరుగుపరుస్తోంది

మొత్తంమీద 'పల్నాటియుద్ధం' చారిత్రిక చిత్రంగా కాక సాంఘికచిత్రంగా సఫలమయిందని చెప్పవచ్చు దీనికితోడు సిద్ధహస్తులయిన నటీవర్గం చిత్రంలో వున్నారు


చిత్రానికి ట్రీట్ మెంట్ రాసినవారిని అభినందించాల్సింది. ఫోటోగ్రఫీ, శబ్దంబాగుంది. ఎడిటింగ్ ఏమంతబాగాలేదు. మ్యూజిక్‌లో చెప్పుకోదగినంత ప్రత్యేకత అభిరుచి కన్పించలేదు

నటీవర్గంలో కన్నాంబ, నాయకురాలిగా బాగానటించింది. నాగేశ్వరరావు తననటనలో కౌశల్యాన్ని ప్రదర్శించాడు. లింగమూర్తినటన పేలవంగావుంది గోవిందరాజుల సుబ్బారావు బహ్మనాయునిపాత్రకు తగినవాడుకాదు అందుకనే అనుకున్నంతబాగాలేదు నటన ఫరవాలేదు.

'పల్నాటి యుద్ధం' లాంటి చారిత్రిక ఖండాన్ని సినిమాతీసినందుకు 'శారదాప్రొడక్షన్స్' వారిని అభినందించాల్సిందే! ఇకముందు ఇలాంటి చారిత్రిక సినిమాల్ని ఇంత అవకతవకగా తీయ సాహసించరాదని, శారదాసృష్టికర్తల్ని కోరడం ఎంతో అవసరం

ముందుముందు తెలుగుసినిమా రంగంలో ఆంధ్రప్రజల్ని అభ్యున్నతిపధంపై నడిపించే చిత్రాలు తయారుకావాలని అభిలషించడం ప్రతిఆంధ్రుని కర్తవ్యము

సమీక్ష :



ఆంధ్ర విద్యార్థి

కార్యస్థానం — వెల

గుంటూరు — పావలా

ఏ. ఎస్. ఆర్. కృష్ణగారి సంపాదకత్వాన "ఆంధ్ర విద్యార్థి" ప్రథమ సంచిక బాపూజీ ముఖచిత్రంతో మా కార్యాలయం చేరింది ఆంధ్రలో అనేక పత్రికలు అవతరిస్తున్నాయ్ గాని విద్యార్థులకు ఒక్క 'నవయుగ' తప్ప యింతవరకు ఏదీలేదు ఇప్పుడు విద్యార్థి కాంగ్రెసు సోదరులు ఆంధ్ర విద్యార్థుల సేవా తత్పరతతో ఒక పక్షపత్రికను నడపటం ముదావహం.

భాష బాగుంది విద్యార్థి సమస్యలు చిత్రించబడ్డాయి. విద్యార్థుల పత్రికకు కావలసిన వివిధ శీర్షికలు ఫొటోలువేసి యికముందు పత్రికను ఆకర్షణీయంగా తీసుకొస్తారని ఆశిస్తాం.

పోతే సంపాదకవర్గానికి మా దొక వినయపూర్వక హెచ్చరిక. నేడు విద్యార్థులంతా ఐక్యతావసరాన్ని గుర్తించి దానికోసం గాఢంగా కృషిచేస్తున్నారు అట్టియీ తరుణంలో విద్యార్థుల ఐక్యతాభిలాషను దుయ్యబట్టటం కాలవాహినికి ఎదురీదటం, విద్యార్థులకు సేవజేయలేకపోవటం జరుగుతుంది.

ఈ దృక్పథంతో పత్రికా నిర్వాహకులు యుండబట్టే. తమలోని భేదాలను మరచిపోక త్రాటిపై ఐక్యమై పోరాడిన ఏ. సి. కాలేజీ. వాల్తేరు విద్యార్థుల పోరాటంలోని విద్యార్థి ఐక్యతను 'ఆంధ్రవిద్యార్థి'లో ప్రకటించిన రిపోర్టులు ప్రతిబింబించలేక పోయినాయి

'ఆంధ్రవిద్యార్థి' నిర్వాహకులకు మాదొకటే ఒకవిజ్ఞప్తి నేడువిద్యార్థులు ఐక్యతను వాంఛిస్తున్నారు ఐక్యపోరాటాలు జరుపుతున్నారు. విద్యార్థుల కార్యకలాపాలను ప్రతిబింబించే పత్రికయినా యీ ఐక్యతావాంఛను బలపర్చుతుందని ఆశిస్తున్నారు. "ఆంధ్రవిద్యార్థి" గూడ విద్యార్థులలోని యీ భావాలను గమనించి ఐక్యవిద్యార్థి ఉద్యమ నిర్మాణమునకు పూనుకొంటుందని ఆశిసాం

వర్కరు

కార్యస్థానం — వెల

బెజవాడ — పావలా

ఆంధ్రరాష్ట్ర ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ మాసపత్రిక 'వర్కర్' మాకు చేరింది వివిధ సమస్యలపై విర్మాణాత్మక సూచనలతో వివరంగా వ్యాసాలు వ్రాయబడ్డాయి. ఆంధ్రకార్మికులకు నేడు ఎంతేని గల పత్రికావసరాన్ని 'వర్కరు' తప్పక తీరుస్తుంది ప్రతి వర్కరు, కార్మిక ఉద్యమాభిలాషి తప్పక చదివితీరవలసిన పత్రిక.

సర్వోదయ

కార్యస్థానం — వెల

బెజవాడ — పావలా

నేడు ఆంధ్ర పత్రికావనంలో పూసే అనేక పుష్పసముదాయంలో ఇదొకటి కాశీవిశ్వనాథంగారి సంపాదకత్వాన 'జైప్రకాశ్' ముఖచిత్రంతో ప్రథమసంచిక వచ్చింది. అదో మోస్తరుగా వుంది

యువజన పాఠాలు

రచయిత బొల్లిముంత శివరామకృష్ణ

దొరకుచోటు

ది జనరల్ పబ్లిషింగ్ కంపెనీ, తెనాలి.

వెల : ఆరు అణాలు

బొల్లిముంత శివరామకృష్ణగారు యువజన సంఘాలలో పనిచేస్తూ రాత్రి పాఠశాలను నడిపారు. తాము రాత్రి పాఠశాలలద్వారా ఆస్వాదించుకొన్న అనుభవాన్ని. తన రచనా ఉపజ్ఞతను జోడించి ఈపుస్తకాన్ని రచించారు. ఇటువంటి రచయితలు ముందుకువచ్చి ఆంధ్రప్రజలలో విజ్ఞానజ్యోతులు వెలిగించాలి

ఈ పుస్తకంలో అక్షరాభ్యాసానికి నులువు మార్గం చూపెట్టబడింది అభ్యుదయ భావాలతో నిజమైన విజ్ఞానాన్ని పిల్లలకు అందిస్తుంది. కనుక యువజన కార్యకర్తలు తమ రాత్రి పాఠశాలలో ఈ పుస్తకాన్ని పాఠ్యగ్రంథంగా స్వీకరించవచ్చు

చారుణి

గ్రంథకర్త పాటిబండ మాధవశర్మ

M A (Hons)

వెల : రూపాయి

ప్రాప్తిస్థానం బాబీ గురుకులం,

గాంధీనగర్ - బెజవాడ

జాతి పునర్నిర్మాణానికి పూనుకొండి !

"ఆంధ్రజాతి పునర్నిర్మాణానికి యువకులు పూనుకోవాలని. ఆంధ్రజాతి అభివృద్ధికి అడ్డు తగులుతున్న నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడుచున్న సోదర తెలంగాణా ప్రజలకు సహాయపడాలని — దొంగవ్యాపారాన్నరికట్టడంలోను, ధాన్యసేకరణలోను ప్రభుత్వానికి సహాయపడాలని" శ్రీ కొల్లి సత్యనారాయణగారు సెప్టెంబరు 16, 17, 18 తేదీలలో చోడాయపాలెం ఫిర్కా చెరుగుడిపోటీల సందర్భంలో జరిగిన బహిరంగసభ కధ్యక్షత వహిస్తూ యువకుల నుద్బోధించారు. గత సెప్టెంబరులో చోడాయపాలెం ఫిర్కా చెరుగుడి పోటీలు మైనేనివారి పాలెంలో జరిగాయి. వివిధరాజకీయాభిప్రాయాలు గల యువకులీ పోటీలలో 8 గ్రామాలనుండి 14 టీములుగా పాల్గొన్నారు. నల్లూరి "చౌదరి టీము"కు ప్రథమ బహుమానం వచ్చింది.

"మతకలహాల నరికట్టండి"

బాపట్ల తాలూకా గోళ్ళమూడిపాడు గ్రామ యువజన సంఘవార్షికోత్సవం సెప్టెంబరు 18 న జయప్రదంగా జరిగింది. 18 వ తేదీన ఆటల కార్యక్రమం ఆనందంగా జరిగింది. సుమారు 100 మంది యీ కార్యక్రమంలో పాల్గొన్నారు యువజన సర్వసభ్యసమావేశం 19 వ తేదీన పి సుబ్బారావుగారి అధ్యక్షతన జరిగింది దేశరక్షణకై ప్రతియువకునికి 'నిర్బంధ సైనికశిక్షణ' యివ్వాలని, రాత్రి పాఠశాలలమీద నిషేధం తొలగించాలని. "సీతారామరాజు", "సిమ్లా భాగవతం" మీద విధించిన నిషేధాన్ని తొలగించాలని మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతూ యేకగ్రీవంగా తీర్మానించారు. కొత్తపల్లి నాగభూషణంగారు అధ్యక్షులుగాను, ఉప్పల సుబ్బారావుగారు కార్యదర్శిగాను నూతన కార్యవర్గం యెన్నుకోబడింది. మరునటిరోజు బహిరంగసభలో జిల్లాయువజన సంఘాధ్యక్షులు యం. నాగేశ్వరరావుగారు దేశపునర్నిర్మాణంకోసం, మతకలహాల నరికట్టేందుకు యువకులు తయారుకావాలని. ఐక్యవిచ్ఛిన్నకరశక్తులను విమర్శించుతూ యువకులంతా ఐక్యతతో ముందుకు రావాలని విజ్ఞప్తిచేశారు. కరువు నరికట్టడానికై రైతులు, యువకులు ముందుకు రావాలని రైతునాయకులైన యం. వెంకటరత్నంగారన్నారు. సభకు 300 మంది ప్రజలువచ్చారు.